ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 సంచిక : 73 పేజీలు :12 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | బుధవారం 19 నవంబర్ 2025 | వెల : 5/-రూ ॥

VOLUME :12 ISSUE :73 PAGES :12 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | WED 19 NOVEMBER 2025 | PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# నేడు సత్యసాయి, కడప జిల్లాల్లో సీఎం చంద్రబాబు పర్యటన

- నేడు శ్రీ సత్యసాయి, కడప జిల్లాల్లో పర్యటించనున్న సీఎం చంద్రబాబు
- పుట్టపర్తిలో ప్రధాని మోదీతో కలిసి సత్యసాయి శత జయంతి వేడుకలకు హాజరు
- కడప జిల్లా నుంచి 'అన్నదాత సుఖీభవ' రెండో విడత నిధుల విడుదల
- 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,135 కోట్లు జమ
- రైతులతో ముఖాముఖి, స్థానిక కేడర్‌తో సమావేశం కానున్న ముఖ్యమంత్రి



పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు (నవంబరు 19) శ్రీ సత్యసాయి, కడప జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన రెండు కీలక కార్యక్రమాల్లో పాల్గొంటారు. పుట్టపర్తిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కలిసి శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొననుండగా, కడప జిల్లాలో 'అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్' రెండో విడత నిధులను విడుదల చేయనున్నారు.సీఎం చంద్రబాబు ఇవాళ సాయంత్రమే హైదరాబాద్ నుంచి నేరుగా పుట్టపర్తికి చేరుకుని రాత్రికి అక్కడే బస చేస్తారు. రేపు ఉదయం 9:25 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి రానున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఆయన స్వాగతం పలుకుతారు. అనంతరం ఉదయం 10 గంటలకు ప్రధానితో కలిసి సాయి కుల్వంత్ హాల్‌లోని భగవాన్ శ్రీ సత్యసాయి మహా సమాధిని దర్శించుకుంటారు. ఆ తర్వాత శ్రీ సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో జరిగే శత జయంతి ఉత్సవాల్లో ఇరువురు నేతలు పాల్గొంటారు.ప్రధాని మోదీకి వీడ్కోలు పలికిన అనంతరం, మధ్యాహ్నం 1:15 గంటలకు ముఖ్యమంత్రి కడప జిల్లా పర్యటనకు బయలుదేరుతారు. కమలాపురం నియోజకవర్గంలోని పెండ్లిమర్రికి చేరుకుని అక్కడ 'అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్' పథకం రెండో విడత నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక నుంచి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లోకి నిధులను జమ చేసి, అనంతరం ప్రసంగిస్తారు. ఈ రెండో విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి రూ. 7,000 చొప్పున మొత్తం రూ. 3,135 కోట్లను ప్రభుత్వం జమ చేయనుంది. ఇప్పటికే ఈ ఏడాది ఆగస్టు 2వ తేదీన తొలి విడతగా అర్హులైన రైతులకు రూ. 7,000 చొప్పున ప్రభుత్వం అందించింది. తాజా విడతతో కలిపి ఈ పథకం ద్వారా రెండు విడతల్లో రైతులకు మొత్తం రూ. 6,309.44 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరుతోంది. పెండ్లిమర్రిలో నిధుల విడుదల కార్యక్రమానికి ముందు సీఎం స్థానిక గ్రోమోర్ ఎరువుల

వివరాలు 2లో..



## ఉద్యోగాలకే మా ప్రాధాన్యం.. రేడియేషన్ భయాలు లేవు

- గూగుల్ ప్రాజెక్ట్‌పై లోకేశ్ కీలక వ్యాఖ్యలు
- ఏపీని ప్రపంచ స్థాయి ఏఐ హబ్‌గా మారుస్తామని వ్యాఖ్య
- గూగుల్ డేటా సెంటర్ విలువ ప్రజలకు తెలుసన్న మంత్రి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లోని తర్లువాడలో ఏర్పాటు చేయనున్న గూగుల్ డేటా హబ్ వల్ల రాష్ట్రంలో నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈ ప్రాజెక్టుకు స్థానిక ప్రజల నుంచి వస్తున్న మద్దతును ప్రస్తావిస్తూ ఆయన ట్విట్టర్ వేదికగా స్పందించారు.తర్లువాడలో ఏర్పాటు కానున్న డేటా సెంటర్‌పై ఓ ప్రముఖ ఆంగ్ల పత్రిక ప్రచురించిన కథనాన్ని లోకేష్ తన ట్విట్టర్ ఖాతాలో పంచుకున్నారు. రేడియేషన్ వంటి ఆందోళనలు ఉన్నప్పటికీ, స్థానిక ప్రజలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఆ కథనం పేర్కొంది. ఈ విషయాన్ని ఉటంకిస్తూ, గూగుల్ డేటా ప్రాజెక్టు విలువ ప్రజలకు తెలుసని

వివరాలు 2లో..



## ఉగ్రవాదం నుంచి ప్రజలను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉంది

- షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో జైశంకర్ సందేశం
- ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సహించకూడదన్న జైశంకర్
- ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించకూడదన్న జైశంకర్

పెన్ పవర్ డెస్క్:భారత ప్రజలను ఉగ్రవాదం నుంచి రక్షించుకునే హక్కు దేశానికి ఉందని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు.

వివరాలు 2లో..

## మావోయిస్టు కీలక నేత హిడ్మా మృతి... నిర్ధారించిన పోలీసులు

- మారేడుమిల్లి ఎన్ కౌంటర్ లో హిడ్మా, ఆయన భార్య రాజే సహా మొత్తం ఆరుగురు మావోయిస్టులు మృతి
- ఉదయం మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు
- మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా తలపై రూ.6 కోట్ల రివార్డు



పెన్ పవర్ డెస్క్:మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు కీలక నేత, కేంద్ర కమిటీ

వివరాలు 2లో..

## ధాన్యం కొనుగోళ్లలో సరికొత్త రికార్డు..

### 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి రూ.560 కోట్లు జమ

- రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు
- ఇప్పటివరకు 2.36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి రూ.560 కోట్లు జమ
- వాట్సాప్ ద్వారా ధాన్యం విక్రయించే సరికొత్త సౌకర్యం
- తుపాను నేపథ్యంలో రైతులకు ఉచితంగా టార్పాలిన్ల పంపిణీ



వివరాలు 2లో..

## విజయవాడ, కాకినాడలో మొత్తం 31 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశాం

- విజయవాడ, కాకినాడలో 31 మంది మావోయిస్టుల అరెస్ట్
- ఆటోనగర్‌లో కూలీల వేషంలో తలదాచుకున్న నక్సల్స్
- ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అగ్రనేతలు కూడా అరెస్ట్ అయిన వారిలో ఉన్నట్లు సమాచారం
- ఏఓబీ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం
- పక్కా సమాచారంతోనే అరెస్టులు చేసినట్లు వెల్లడించిన ఇంటెలిజెన్స్ చీఫ్



వివరాలు 2లో..

## నేడు ఏపీ, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన



- పుట్టపర్తి, కోయంబత్తూరులో ప్రధాని మోదీ పర్యటన
- పుట్టపర్తిలో శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలకు హాజరు
- సత్యసాయి స్మారక నాణెం, స్టాంపుల విడుదల కార్యక్రమం
- కోయంబత్తూరులో పీఎం-కిసాన్ 21వ విడత నిధుల విడుదల
- 9 కోట్ల మంది రైతులకు రూ. 18,000 కోట్లకు పైగా ప్రయోజనం

వివరాలు 2లో..

## ఓటమికి బాధ్యత వహిస్తూ మౌనదీక్ష చేపట్టబోతున్న ప్రశాంత్ కిశోర్

- బీహార్ ఎన్నికల ఓటమికి పూర్తి బాధ్యత తనదేనన్న ప్రశాంత్ కిశోర్
- ప్రజల నమ్మకాన్ని గెలవడంలో విఫలమయ్యామని అంగీకారం
- ప్రాయశ్చిత్తంగా ఈ నెల 20న మౌన ఉపవాసం చేయనున్నట్లు ప్రకటన

పెన్ పవర్ డెస్క్:బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయానికి తానే పూర్తి బాధ్యత వహిస్తున్నట్లు జన్ సురాజ్ పార్టీ అధినేత, ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ప్రకటించారు. ఫలితాల అనంతరం తొలిసారిగా మీడియాతో మాట్లాడిన ఆయన, తమ పార్టీ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోలేకపోయిందని అంగీకరించారు. ఈ వైఫల్యానికి ప్రాయశ్చిత్తంగా ఈ నెల 20న గాంధీ భీతిహర్వా ఆశ్రమంలో ఒకరోజు మౌన ఉపవాసం చేయనున్నట్లు తెలిపారు."బీహార్ రాజకీయాల్లో మార్పు తీసుకురావాలనే

వివరాలు 2లో..



## ఐబొమ్మ రవి కేసులో ఈడీ రంగప్రవేశం...

### మనీలాండరింగ్ జరిగినట్టు అనుమానం

- ఐ-బొమ్మ కేసు దర్యాప్తులోకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
- మనీలాండరింగ్ కోణంలో విచారణకు ఈడీ సిద్ధం
- బెట్టింగ్ యాప్స్, క్రిప్టో వాలెట్ల ద్వారా నిధుల సమీకరణ
- నిందితుడి ఖాతాలోని రూ.3.5 కోట్లను ఇప్పటికే ఫ్రీజ్ చేసిన పోలీసులు





పెన్ పవర్ డెస్క్:తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐ–బొమ్మ' కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో భారీగా ఆర్థిక అవకతవకలు, మనీలాండరింగ్ జరిగినట్లు అనుమానిస్తున్న ఈడీ, లోతైన దర్యాప్తు చేపట్టేందుకు సమాయత్తమవుతోంది.ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఎఫ్ఐఆర్, దర్యాప్తు నివేదికలను తమకు అందించాలని కోరుతూ ఈడీ అధికారులు హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు

వివరాలు 2లో..

## ఏపీలో ఇక ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా



- ఏపీలో ప్రతి కుటుంబానికి యూనివర్సల్ హెల్త్ పాలసీ
- వైద్య సేవల కవరేజీ రూ.25 లక్షలకు పెంపు
- పేద, ధనిక వర్గాలందరికీ ఈ పథకం వర్తింపు
- గతంలోని వేర్వేరు ప్యాకేజీల విధానానికి స్వస్తి
- రాష్ట్రవ్యాప్తంగా 1.63 కోట్ల కుటుంబాలకు మేలు

వివరాలు 2లో..

## పుట్టపర్తిలో సచిన్ టెండూల్కర్ ను కలిసిన ఏపీ మంత్రి నారా లోకేశ్

- నేడు పుట్టపర్తిలో సత్యసాయి శతజయంతి వేడుకలు
- పుట్టపర్తి చేరుకున్న సచిన్, మంత్రి నారా లోకేశ్ తదితరులు
- సచిన్ తో పలు అంశాలపై చర్చించిన లోకేశ్

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో భారత క్రికెట్ దిగ్గజం, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ విషయాన్ని లోకేశ్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.



వివరాలు 2లో..

# ఎడిటర్ వ్యూ

## విడదలకు షాకివ్వనున్న జగన్.. ఈసారి ఎక్కడికో తెలుసా?

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరో కీలక నిర్ణయం తీసుకునే అవకాశముంది. మాజీ మంత్రి విడదల రజనీని మరో నియోజకవర్గానికి పంపాలని నిర్ణయించినట్లు సమాచారం. 2019 ఎన్నికల్లో చిలకలూరి పేట నియోజకవర్గం నుంచి విజయం సాధించిన విడదల రజని వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా జగన్ కేబినెట్ లో పనిచేశారు. అయితే అక్కడ వైసీపీ నేతలకు, నాటి ఎంపీ, ఎమ్మెల్సీకి పడకపోవడంతో 2024 ఎన్నికల్లో విడదల రజనీని గుంటూరు వెస్ట్ నియోజకవర్గానికి ఇన్ ఛార్జిగా నియమించింది. అక్కడి నుంచే పోటీ చేయించింది. అయితే ఆ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ ఓటమి పాలయింది. గుంటూరు వెస్ట్ నుంచి విడదల రజనీ కూడా ఓటమిపాలయ్యారు. అయితే ఆమె తనను తిరిగి చిలకలూరి పేట నియోజకవర్గం ఇన్ ఛార్జి గా నియమించారు.

**పార్టీ పరిస్థితి బాగుపడకపోగా...**

అయితే విడదల రజని వెళ్లిన తర్వాత పార్టీ పరిస్థితి ఏ మాత్రం బాగుపడలేదని పార్టీ నాయకత్వానికి సమాచారం అందినట్లు తెలిసింది. దీంతో చిలకలూరిపేటలో కొత్త వారికి అవకాశం ఇవ్వాలని వైసీపీ నాయకత్వం నిర్ణయించినట్లు తెలిసింది. విడదల రజనీని గుంటూరు జిల్లాలోని రేపల్లెకు విడదల రజనీని పంపే అవకాశాలున్నాయని అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. చిలకలూరిపేట, గుంటూరు వెస్ట్ నియోజకవర్గం కంటే విడదల రజనీకి రేపల్లె సరైన నియోజకవర్గమని జగన్ కూడా భావిస్తున్నారు. దీంతో చిలకలూరిపేటలో కార్యక్రమాలు తగ్గించుకోవాలని రేపల్లెకు వెళ్లేందుకు సిద్ధం కావాలని అధిష్టానం స్పష్టమైన సమాచారం ఇచ్చినట్ల తెలిసింది. ఈనేపథ్యంలో మరోసారి విడదల రజనీ వర్గం తీవ్ర నిరాశలోకి వెళ్లింది.

**త్వరలోనే అధికారిక ప్రకటన...**

మాజీ మంత్రి విడదల రజనీ త్వరలో వైసీపీ ఇంచార్జ్ గా రేపల్లెకు బదిలీ అయ్యే అవకాశాలున్నాయని ఆమెకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం. దీంతో విడదల రజనీ ఆశ్చర్యంతో పాటు అసంతృప్తికి గురయ్యారని చెబుతున్నారు. చిలకలూరిపేటలో ఆమె ఎప్పటికీ గెలిచే పరిస్థితి లేదని ఆమె ఎప్పటికీ అక్కడ బలమైన అభ్యర్థి కాలేరన్న అభిప్రాయం బలంగా ఉండటంతో ప్రత్యామ్నాయం చూడాలని జగన్ సిద్ధపడినట్లు చెబుతున్నారు. రేపల్లెలో ప్రస్తుతం ఈపూరు గణేష్ ఇంచార్జ్ గా ఉన్నారు, కానీ ఆయన ఎక్కడా కనిపించడం లేదు. అక్కడ వైసీపీకి నాయకత్వం లేకుండా పోయింది. అది బీసీల నియోజకవర్గం కావడం మత్స్యకార వర్గానికి చెందిన తెలంగాణ ముదిరాజ్ వర్గానికి చెందిన విడుదల రజనీ అయితే మంచి అభ్యర్థి అవుతారని వైసీపీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

## ధాన్యం కొనుగోళ్లలో సరికొత్త రికార్డు.. 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి రూ.560 కోట్లు జమ

రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. మంగళవారం నాటికి 32,793 మంది రైతుల నుంచి 2,36,284 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి, వారి ఖాతాల్లో రూ.560.48 కోట్లను జమ చేశామని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 30 శాతం అధికమని ఆయన వెల్లడించారు. విజయవాడ రూరల్ కానూరులోని సివిల్ సప్లైస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ధాన్యం కొనుగోళ్ల పురోగతిని వివరించారు. రైతులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ, నిజాయతీగా కొనుగోళ్లు జరుపుతున్నామన్నారు. క్షేత్రస్థాయిలో దాదాపు 16,000 మంది సిబ్బంది ఈ ప్రక్రియలో నిమగ్నమై ఉన్నారని, జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి 1,81,885 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు జరిగిందని, ఈసారి ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడం వల్లే కొనుగోళ్లు పెరిగాయని అన్నారు. ధాన్యం అమ్మిన వారిలో చిన్న, సన్నకారు రైతులతో పాటు 6,600 మంది కౌలు రైతులు కూడా ఉన్నారని వివరించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో డబ్బులు చెల్లిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని మంత్రి మనోహర్ తెలిపారు. ఈ ప్రక్రియను ఒక సవాలుగా తీసుకుని, దేశంలోనే తొలిసారిగా 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని గర్వంగా చెప్పారు. గుంటూరు జిల్లాకు చెందిన పత్తిపాటి సుబ్బారావు అనే రైతు ఖాతాలో 6 గంటల్లోనే రూ.2.08 లక్షలు, ఏలూరు జిల్లా భీమడోలుకు చెందిన నీలం త్రిమూర్తులు ఖాతాలో 5 గంటల్లోనే డబ్బులు జమ చేశామని ఉదాహరణగా పేర్కొన్నారు.

సాంకేతికతను వినియోగిస్తూ రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. దేశంలోనే మొదటిసారిగా వాట్సాప్ ద్వారా రైతులు తమ ధాన్యాన్ని ఏ రోజు, ఏ మిల్లుకు అమ్మాలో వారే నిర్ణయించుకునే వెసులుబాటు కల్పించామని తెలిపారు. 73373 59375 నంబర్‌కు 'హాయ్' అని సందేశం పంపితే, షెడ్యూల్ వివరాలు వాట్సాప్‌లోనే వస్తాయని, ఇప్పటివరకు 500 మంది రైతులు ఈ సేవలను వినియోగించుకున్నారని వివరించారు.

రానున్న అల్పపీడన తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి మనోహర్ హామీ ఇచ్చారు. రైతు భరోసా కేంద్రాల్లో 50 వేల టార్పాలిన్లను అందుబాటులో ఉంచామని, ఇప్పటికే 19 వేల టార్పాలిన్లను ఉచితంగా పంపిణీ చేశామని తెలిపారు. గోనె సంచుల కొరత లేకుండా 6.34 కోట్ల గోతాలను సిద్ధం చేశామన్నారు. ఈ సీజన్‌లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎండీ ఎస్. ఢిల్లీ రావు కూడా పాల్గొన్నారు.

# విజయవాడ, కాకినాడలో మొత్తం 31 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశాం

విజయవాడ, కాకినాడ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులను అరెస్ట్ చేసినట్లు అదనపు డీజీ (ఇంటెలిజెన్స్) మహేశ్ చంద్ర లడ్డా వెల్లడించారు. ఈ పరిణామం రాష్ట్రంలో తీవ్ర కలకలం సృష్టించింది. అరెస్ట్ అయిన వారిలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కొందరు ముఖ్య నేతలు కూడా ఉన్నట్లు సమాచారం. విజయవాడ శివారులోని కానూరు న్యూ ఆటోనగర్‌లో ఉన్న నాలుగు అంతస్తుల భవనంలో మావోయిస్టులు ఆశ్రయం పొందుతున్నారని ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన భద్రతా బలగాలు ఆ భవనాన్ని చుట్టుముట్టి తనిఖీలు చేపట్టాయి. ఈ సోదాల్లో ఒకేచోట 27 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో ఎక్కువ మంది మహిళలు ఉండటం గమనార్హం. వీరంతా ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన కూలీల ముసుగులో ఎవరికీ అనుమానం రాకుండా ఇక్కడ నివసిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యాదర్శి తిప్పిరి తిరుపతి బృందం ఉన్నట్టు తెలుస్తోంది. విజయవాడ ఆటోనగర్‌లోని ఫ్యాక్టరీలు, టింబర్ డిపోలలో ఛత్తీస్‌గఢ్, ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు పెద్ద సంఖ్యలో పనిచేస్తుంటారు. ఇదే అదునుగా భావించిన మావోయిస్టులు, వారిలో కలిసిపోయి ఆశ్రయం పొందారు. కృష్ణా జిల్లా, విజయవాడ, కాకినాడ ప్రాంతాల్లో కలిపి మొత్తం 31 మంది మావోయిస్టులను అరెస్ట్ చేసినట్లు అదనపు డీజీ (ఇంటెలిజెన్స్) మహేశ్ చంద్ర లడ్డా అధికారికంగా ప్రకటించారు. గత నెల రోజులుగా వీరి కదలికలపై నిఘా పెట్టినట్లు ఆయన వెల్లడించారు. తాజాగా ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏవోబీ)లోని అల్లూరి సీతారామరాజు జిల్లా అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు నిర్వహించిన ఆపరేషన్‌లో ఆరుగురు మావోయిస్టులు మరణించారు. వీరిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా, ఆయన భార్య రాజే కూడా ఉన్నారు.

ఇటీవల వరుస ఎన్‌కౌంటర్లు జరగడం, ఛత్తీస్‌గఢ్‌లో భద్రతను కట్టుదిట్టం చేయడంతో, అక్కడి నుంచి తప్పించుకున్న మావోయిస్టులు ఏపీలోని అంతర్గత ప్రాంతాల్లోకి ప్రవేశించి ఉంటారని అధికారులు

అనుమానిస్తున్నారు. ప్రస్తుతం మావోయిస్టులకు ఆశ్రయం కల్పించిన భవన యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వీరికి ఎవరు సహకరించారు, ఏవైనా దాడులకు ప్రణాళికలు రచించారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అయితే, వారి నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారా లేదా అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. గతంలో మావోయిస్టుల కార్యకలాపాలు ఉద్ధృతంగా ఉన్న రోజుల్లో కూడా ఏపీలోని ఒక నగరంలో ఇంత పెద్ద సంఖ్యలో నక్సల్స్‌ను అరెస్ట్ చేయడం ఇదే తొలిసారని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ఘటనతో రాష్ట్ర పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు.

## నేడు ఏపీ, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో పర్యటించ నున్నారు. పుట్టపర్తిలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనడంతో పాటు, కోయంబత్తూరులో జరిగే రైతుల సదస్సులో పీఎం కిసాన్ 21వ విడత నిధులను విడుదల చేయనున్నారు. ఈ పర్యటనపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. "నవంబర్ 19న పుట్టపర్తిలో శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో పాల్గొనడం కోసం ఆంధ్రప్రదేశ్‌లోని నా సోదర సోదరీమణుల వద్దకు వెళ్లాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని పేర్కొన్నారు. సత్యసాయి బాబా సమాజ సేవను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని గుర్తు చేసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం, ప్రధాని బుధవారం ఉదయం 10 గంటలకు పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయం చేరుకుని, శ్రీ సత్యసాయి బాబా మహాసమాధిని సందర్శించి నివాళులర్పిస్తారు. అనంతరం 10:30 గంటలకు జరిగే శత జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా సత్యసాయి బాబా గౌరవార్థం ఒక స్మారక నాణెం,

ప్రత్యేక స్టాంపులను విడుదల చేసి, సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అక్కడి నుంచి ప్రధాని మోదీ తమిళనాడులోని కోయంబత్తూరుకు బయలుదేరి వెళతారు. మధ్యాహ్నం 1:30 గంటలకు 'దక్షిణ భారత సహజ వ్యవసాయ సదస్సు 2025'ను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా 9 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూర్చేలా పీఎం కిసాన్ పథకం 21వ విడత కింద రూ. 18,000 కోట్లకు పైగా నిధులను విడుదల చేస్తారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాల నుంచి సుమారు 50,000 మంది రైతులు, నిపుణులు పాల్గొననున్నారు.

## ఓటమికి బాధ్యత వహిస్తూ మౌనదీక్ష చేపట్టబోతున్న ప్రశాంత్ కిశోర్

- మొదటి పేజీ తరువాయి

లక్ష్యంతో కొత్త పాత్ర పోషించాం. కానీ ప్రజలు మమ్మల్ని తిరస్కరించారు. మా ఆలోచనల్లోనే ఎక్కడో లోపం ఉండి ఉంటుంది. వంద శాతం బాధ్యత నాదే. చాలా నిజాయతీగా ప్రయత్నించాం, కానీ విఫలమయ్యాం. ఈ నిజాన్ని అంగీకరించడానికి ఎలాంటి ఇబ్బంది లేదు" అని ప్రశాంత్ కిశోర్ అన్నారు. గత మూడేళ్లుగా తన శక్తినంతా ధారపోసి పనిచేసినా ఫలితం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తాను వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని పీకే స్పష్టం చేశారు. బీహార్‌ను బాగు చేయాలనే తన సంకల్పం నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తానని తెలిపారు. "నేను తప్పులు చేసి ఉండొచ్చు, కానీ ఎలాంటి నేరం చేయలేదు. కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టలేదు. హిందూ-ముస్లిం రాజకీయాలు చేయలేదు. డబ్బులిచ్చి ఓట్లు కొనే నేరానికి పాల్పడలేదు" అని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేసిన ప్రశాంత్ కిశోర్ పార్టీ జన్ సురాజ్.. ఒక్క స్థానంలో కూడా గెలవలేకపోవడమే కాకుండా, అభ్యర్థులంతా డిపాజిట్లు కోల్పోవడం గమనార్హం.

## మావోయిస్టు కీలక నేత హిడ్మా మృతి... నిర్ధారించిన పోలీసులు

- మొదటి పేజీ తరువాయి

సభ్యుడు మాద్వి హిడ్మా మృతిచెందారు. హిడ్మాతో పాటు ఆయన భార్య రాజీ, మరో నలుగురు మావోయిస్టులు పోలీసుల ఎదురుకాల్పుల్లో మరణించారు. ఈమేరకు హిడ్మా, రాజే మరణించిన విషయాన్ని పోలీసులు నిర్ధారిస్తూ వారి మృతదేహాల ఫొటోలను రిలీజ్ చేశారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టుల కదలికలకు సంబంధించి కచ్చితమైన సమాచారంతో మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు ఈరోజు ఉదయం కూంబింగ్ చేపట్టాయని ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు.

**గెరిల్లా దాడుల వ్యూహకర్త..**

చిన్న వయసులోనే మావోయిస్టు కేంద్ర కమిటీకి ఎంపికైన హిడ్మా.. గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరొందారు. ఆయన స్వస్థలం ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూర్వాటి గ్రామం. పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ హిడ్మా పనిచేశారు.

**మృతులు..**

మద్వి హిడ్మా, ఆయన భార్య రాజే, అనుచరులు మల్లా, దేవే, చెల్లూరి నారాయణ అలియాస్ సురేశ్, టెక్ శంకర్.

## పుట్టపర్తిలో సచిన్ టెండూల్కర్ ను కలిసిన ఏపీ మంత్రి నారా లోకేశ

- మొదటి పేజీ తరువాయి

సచిన్‌ను కలవడం ఒక గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ భేటీలో క్రికెట్, ఆంధ్రప్రదేశ్‌లో క్రీడల అభివృద్ధి, శ్రీ సత్యసాయి బాబా బోధనలు వంటి పలు అంశాలపై చర్చ జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా క్రికెట్ ఆటలో కాలక్రమేణా వచ్చిన మార్పులు, సచిన్ అద్భుతమైన కెరీర్‌కు సంబంధించిన మధుర జ్ఞాపకాలను ఇరువురూ పంచుకున్నట్లు లోకేశ్ వెల్లడించారు. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలను, ముఖ్యంగా క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సచిన్‌కు వివరించినట్లు తెలిపారు. రాష్ట్రంలో క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలను కూడా ప్రస్తావించినట్టు తెలిపారు. శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో ఆయన జీవితం, బోధనలు, మానవాళికి ఆయన అందించిన నిస్వార్థ సేవ గురించి కూడా తాము మాట్లాడుకున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు. రేపు పుట్టపర్తిలో సత్యసాయి శతజయంతి వేడుకలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, తదితర ప్రముఖులు హాజరవుతున్నారు. ఈ కార్యక్రమం కోసం నారా లోకేశ్ కూడా పుట్టపర్తి చేరుకున్నారు. సచిన్ కూడా పుట్టపర్తి సత్యసాయిబాబా ఆరాధకుడు కావడంతో, ఆయన కూడా పుట్టపర్తి విచ్చేశాడు. ఈ క్రమంలోనే సచిన్ ను నారా లోకేశ్ కలిశారు. లోకేశ్ వెంట మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్ కూడా ఉన్నారు.

## నేడు సత్యసాయి, కడప జిల్లాల్లో సీఎం చంద్రబాబు పర్యటన

- మొదటి పేజీ తరువాయి

కేంద్రాన్ని సందర్శిస్తారు. అనంతరం రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకుంటారు. ప్రభుత్వ కార్యక్రమం ముగిసిన తర్వాత స్థానిక పార్టీ కేడర్‌తో సమావేశమై, రాత్రికి అమరావతికి తిరిగి రానున్నారు.

## ఉగ్రవాదం నుంచి ప్రజలను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉంది

- మొదటి పేజీ తరువాయి

రష్యాలో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్‌లో ఆయన ఉగ్రవాదానికి వ్యతిరేకంగా గట్టిగా మాట్లాడారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానిని సహించకూడ దని ఆయన అన్నారు. ఉగ్రవాదం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించే ధోరణి ఉండకూడదని ఆయన తేల్చి చెప్పారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించరాదని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం అనేది ఉమ్మడి ప్రాధాన్యంగా ఉండాలని సూచించారు. ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా జైశంకర్ రష్యాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్‌సీవో సదస్సులో పాల్గొన్నారు. అంతకుముందు రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లవ్రోవ్‌తో ఆయన సమావేశమయ్యారు. ఇరువురు ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చలు జరిపినట్లు సమాచారం.

## ఐబొమ్మ రవి కేసులో ఈడీ రంగప్రవేశం...

- మొదటి పేజీ తరువాయి

లేఖ రాశారు. పోలీసుల నుంచి వివరాలు అందిన వెంటనే ఈడీ అధికారులు తమ విచారణను అధికారికంగా ప్రారంభించనున్నారు. ఐ-బొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమ్మడి రవికి బెట్టింగ్ యాప్‌ల ప్రకటనల ద్వారా భారీగా నిధులు అందినట్లు గతంలో పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అంతేకాకుండా, ఓ క్రిప్టో వాలెట్ నుంచి రవికి చెందిన ఎన్నారై ఖాతాకు ప్రతి నెలా రూ.15 లక్షలు బదిలీ అయినట్లు కూడా గుర్తించారు. ఈ నేపథ్యంలోనే విదేశీ నిధుల ప్రవాహం, హవాలా లావాదేవీలపై ఈడీ దృష్టి సారించింది.

ఇప్పటికే పోలీసులు నిందితుడు రవికి చెందిన బ్యాంకు ఖాతాల్లోని సుమారు రూ.3.5 కోట్లను ఫ్రీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈడీ ఎంట్రీతో నిందితుడి బ్యాంకు ఖాతాల నిర్వహణ, నిధుల మళ్లింపుపై పూర్తి స్థాయిలో విచారణ జరగనుంది.

## ఉద్యోగాలకే మా ప్రాధాన్యం.. రేడియేషన్ భయాలు లేవు

- మొదటి పేజీ తరువాయి

లోకేశ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రంలో ప్రపంచ స్థాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్‌లను నిర్మించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ హబ్‌ల ద్వారా నూతన ఆవిష్కరణలు ఊపందుకుంటాయని, సాంకేతికంగా రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యం కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాదని, తద్వారా యువతకు ఉపాధి కల్పించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమని ఆయన పేర్కొన్నారు.

## ఏపీలో ఇక ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత కల్పించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' అనే బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టిందని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ తెలిపారు. ఈ విధానం ద్వారా పేద, ధనిక అనే తేడా లేకుండా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ రూ.25 లక్షల వరకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.5 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న కుటుంబాలకు రూ.2.50 లక్షల వరకు బీమా సంస్థ ద్వారా క్యాష్‌లెస్ వైద్యం అందుతుందని, ఆపై అయ్యే ఖర్చును రూ.25 లక్షల వరకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ భరిస్తుందని వివరించారు. ఈ పాలసీతో రాష్ట్రంలోని 1.63 కోట్ల కుటుంబాలకు మేలు జరుగుతుందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ కింద వేర్వేరు ప్యాకేజీలు, రేట్లతో ప్రజలను గందరగోళానికి గురిచేశారని విజయ్ కుమార్ ఆరోపించారు. కానీ, కూటమి ప్రభుత్వం అన్నింటినీ ఒకే ప్యాకేజీ కిందకు తీసుకొచ్చి, అందరికీ ఒకే ప్రమాణాలతో నాణ్యమైన వైద్యం అందిస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2,493 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోని 31 సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ మార్పుల వల్ల ప్రస్తుత లబ్ధిదారులకు ఎలాంటి నష్టం జరగదని, ఆరోగ్యశ్రీ ఉద్యోగుల భద్రతకు కూడా ఢోకా లేదని హామీ ఇచ్చారు. పాలసీ నిర్వహణ కోసం రాష్ట్రాన్ని శ్రీకాకుళం నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు జోన్-1గా, గుంటూరు నుంచి రాయలసీమ వరకు జోన్-2గా విభజించినట్లు చెప్పారు. "ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. ఈ యూనివర్సల్ హెల్త్ పాలసీతో ఏపీని దేశంలోనే ఆరోగ్య రోల్ మోడల్‌గా నిలపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం" అని విజయ్ కుమార్ అన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# 20 లక్షల జీవీఎంసీ నిధులతో యుజిడి పనులకు భూమి పూజ

**తూర్పు నియోజకవర్గ పరిధిలో పెండింగ్ పనులు పూర్తి చేస్తాం..! ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు**



**విశాఖ తూర్పు,పెన్ పవర్, నవంబరు 18:**జీవీఎంసీ 13 వ వార్డు భగత్ సింగ్ నగర్ లో 20 లక్షల రూపాయలు జీవీఎంసీ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, వార్డ్ కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ,శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు 20 లక్షల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పనులను సత్వరమే ప్రారంభించి,సకాలంలో పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు.నియోజకవర్గ పరిధిలో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని, ప్రధానంగా కాలువలు రోడ్లు డ్రైనేజీ పనులకు ప్రాధాన్యతను నిస్తాన్నమన్నారు. కార్యక్రమంలో వాటర్ వర్క్ ఏఈ శ్రీనివాస్,వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు.వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి. బాలస్వామి,బిజెపి మండల అధ్యక్షుడు సతీష్.మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి. సీనియర్ నాయకులు పోత్రకొండ ధర్మారావు,సురేష్ పట్టా.నూకరాజు,వడిసెల.శ్రీను, జక్కన్న,పిఐ.బాలరాజు, కిల్లంశెట్టి.శ్రీనివాస్,సంజీవరావు,ప్రసాద్,గుంజ శ్రీను.గణపతి, దాలినాయుడు,రామలక్ష్మి, దేవి,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# యువతకు చేయి అందిద్దాం డ్రగ్స్ రహిత భవిష్యత్తు నిర్మాణమే లక్ష్యం

**విశాఖలో నషా ముక్త్ భారత్ అభియాన్‌కు అధికారులు, విద్యావేత్తల పిలుపు**






79950957

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 18** :యువత భవిష్యత్తును చీకట్లు చేసే మాదకద్ర వ్యాల మహమ్మారిని అరికట్టేందుకు సమాజం సమిష్టిగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, ఆంధ్ర విశ్వవిద్యాలయ వీసీ జీపీ రాజశేఖర్ పిలుపునిచ్చారు. మార్పుకోసం ఎదురు చూడకుండా మనమే అంబాసిడర్లమై, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి" అని సూచించారు.

నషా ముక్త్ భారత్ అభియాన్‌కు ఐదేళ్లు పూర్తి అయిన సందర్భంగా కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమానికి అనుసం ధానంగా ఏయూలోని ఎంవీఎస్ మూర్తి ఆడిటో రియంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. కలెక్టర్, సీపీ, వీసీతో పాటు ఎన్‌సీబీ జోనల్ డైరెక్టర్ పంకజ్ కుమార్ ద్వివేది, సెట్విస్ సీఈవో కవిత, ఐసీడీఎస్ పీడీ రామలక్ష్మి పాల్గొన్నారు. మాదక ద్రవ్య రహిత జిల్లాగా విశాఖను తీర్చిదిద్దుదాం కలెక్టర్ హరేందిర ప్రసాద్

జిల్లాను పూర్తిగా మాదకద్రవ్య రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, యువత, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ పిలుపునిచ్చారు.

గత ఐదేళ్లుగా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించి యువతలో అవగాహన కల్పించా మని పేర్కొన్నారు.ఒక్కొక్కరి ఇంట్లో ఒక అంబా సిడర్ అవసరం. మాదకద్రవ్యాల బారిన పడే అవకాశం కనిపించిన వెంటనే నిలువరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు.

డీ-అడిక్షన్ సెంటర్ల అవసరాన్ని వివరించారు.

ఎంజాయ్' అనే పేరుతో జీవితాన్ని పాడు చేసుకోకండి సీపీ శంఖబ్రత బాగ్చీ

దేశంలో 15.5 కోట్ల మంది యువత వ్యసనాల బారిన పడటం ఆందోళనకరమని సీపీ ఆవేదన వ్యక్తం చేశారు.తన పదవీకాలంలో పెద్ద సంఖ్య లో తల్లిదండ్రులు తమ పిల్లలు డ్రగ్స్‌కు బానిసై పోయిన విధంగా ఎదుర్కొంటున్న బాధలను తనకు తెలియజేశారన్నారు.డ్రగ్స్ మనిషిని పూర్తిగా నాశనం చేసే శక్తి కలిగినవే. దయచేసి ఎవరూ వాటి జోలికి వెళ్లొద్దు అని విజ్ఞప్తి చేశా రు.తన కుటుంబంలో కూడా అత్యంత సన్నిహి తులు మాదకద్రవ్యాల కారణంగా ప్రాణాలు కో ల్పోయిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచే శారు.ఏవైనా సమస్యలు ఎదురైతే డీ-అడిక్షన్ సెంటర్లను సంప్రదించాలని, వెంటనే 1972 ఈగల్ హెల్ప్ లైన్ లేదా వాట్సాప్ 79950957 99లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు దేశ భవిష్యత్తు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి %-%వీసీ రాజశేఖర్, ఎన్‌సీబీ డైరెక్టర్

తరువాత మాట్లాడుతూ ఏయూ వీసీ రాజశే ఖర్, ఎన్‌సీబీ జోనల్ డైరెక్టర్ పంకజ్ కుమార్ ద్వివేది యువత విజన్ 2047 లక్ష్యాలను చేరు కునేందుకు క్రమశిక్షణ, నిబద్ధత అవసరమని చెప్పారు.

# రైతులకు ఉపయోగపడే వైపు పంట కాలువలు నిర్మించాలి!

**"రైతుల్ని దాటేసి రోడ్డుదారి చూసిన చెక్‌డ్యామ్‌గిరిజనుల అరుపు విననిదే అధికారుల మౌనం"**
**"రైతులకు మేలు చేయాల్సిన చెక్‌డ్యామ్.. కాంట్రాక్టర్లకే లాభం?**
**నిట్ట మామిడి పాలెం గిరిజన రైతుల ఆవేదన**



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్18:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం జర్రెల నిట్ట మామిడిపాలెం గ్రామ పరిధిలో చేపట్టిన చెక్‌డ్యామ్ నిర్మాణంలో పలు ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. రైతులకు నీరందేలా ఉండాల్సిన చెక్‌డ్యామ్ కాలువను అసలు అవసరం లేని వైపుకు మళ్లించడం రైతుల్లో తీవ్ర ఆవేదనకు దారి తీసింది. గ్రామస్తుల వివరాల ప్రకారం, రైతుల పొలాలకు నీరు చేరే వైపున డ్యామ్ పంట కాలువలు నిర్మించాల్సి ఉండగా,

గుత్తేదారులు రోడ్డుకు దగ్గరగా ఉన్న కారణంగా మెటీరియల్ తేలికగా అందుబాటులో ఉండే ప్రాంతానికే నిర్మాణం మార్చినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంలో గ్రామ పెద్దలు, గిరిజన రైతులు పలుమార్లు అధికారులు, కాంట్రాక్టర్లకు సమస్యను తెలియజేసినా ఎటువంటి స్పందన రాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా, స్థానిక భౌగోళిక పరిస్థితులు, రైతుల అవసరాలు బాగా తెలిసిన స్థానిక కాంట్రాక్టర్లు అయితే ఇలా చేయరని, నర్సీపట్నం ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్లు కావడం వల్ల గ్రామస్తుల మాట పట్టించుకోకుండా నిర్మాణం కొనసాగించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.దీనిపై సంబంధిత ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం, అనుమానాస్పద మౌనం రైతుల్లో అసహనానికి కారణమైంది. "మాకు నీళ్లు రావడమే లక్ష్యం%ా% కానీ డ్యామ్ నిర్మిస్తున్నది ఎవరి కోసమో అర్థం కావడంలేదు" నిర్మాణం అవసరం లేని వైపున కాలువ గోడలు చేపట్టడంతో డ్యామ్ పూర్తయినా నీరు రైతుల పొలాలకు చేరే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు.గ్రామ ప్రజలు చెక్‌డ్యామ్ దోవ మార్చి, అసలు ఉద్దేశాన్ని నిలబెట్టి, రైతులకు ఉపయోగపడే విధంగా మళ్లీ పనులు చేపట్టాలని మండల అధికారులను కోరుతున్నారు. రైతులకు ఉపయోగపడే వైపున మార్పులు చేసి కాలువలను తిరిగి నిర్మించడం వల్ల రైతులకు ప్రయోజనం ఉంటుందని కావున రైతుల అభిలాషకు అనుగుణంగా పంట కాలువ నిర్మాణం చేపట్టాలని గ్రామ పెద్ద స్థానిక నాయకులు అడపా విష్ణుమూర్తి అధికారులను కోరారు.



# శిశు మరణాల గ్రామలలో

# ఆకస్మికంగా పర్యటించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి





- శిశువులు మరణించిన కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్న జిల్లా వైద్యశాఖ అధికారి.
- వైద్యాధికారులు ఆయా గ్రామాలలో వారం రోజులు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి.
- వైద్య అధికారులు వైద్యసిబ్బంది విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవు.
- అల్లూరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణమూర్తి నాయక్.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబర్ 18.**అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలంలో కిలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి దారెల పంచాయితీ పరిధిలో శిశుమరణాల గ్రామాలైనా కుమ్మరిపుట్టు, తలింబ, చీవుకుచింత గ్రామాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి కృష్ణమూర్తి నాయక్ ఇంటింటికి వెళ్లి ఇటీవల మృతి చెందిన శిశువుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో మాట్లాడి విచారణ చేపట్టారు . మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఐదుగురు శిశువుల మరణానికి గల కారణాలను ప్రత్యేక వైద్య బృందం ద్వారా శాంపిల్స్ సేకరించడం జరిగిందన్నారు. మరణాలకు పూర్తి వివరాలని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు ఆయన తెలియజేసారు. గ్రామాలలో చిన్నారులు, రోగులు అనారోగ్యంతో బాదపడుతూ వైద్యం అందక మరణిస్తే సహించేది లేదని వైద్య అధికారులు వైద్య సిబ్బందికు హెచ్చరించారు. ఎప్పటికప్పుడు గ్రామ స్థాయిలోనే రోగులను గుర్తించి చికిత్సలు అందించాలని లేదా వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మెరుగైన వైద్యం కొరకు ఇతర ఉన్నతాసుపత్రులకు తరలించి చికిత్సలు జరిపించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధి గ్రామాలలో ఇంటింటి సందర్శనలు నిర్వహించే క్షేత్ర స్థాయి సిబ్బంది, పర్యవేక్షణ సిబ్బంది అంకిత భావంతో తమ విధులను నిర్వర్తించాలని, విధినిర్వహణలో ఆలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పి.హెచ్.సి పరిధి వైద్య సిబ్బందితో టీమ్ లను ఏర్పాటుచేసి దారెల పంచాయితీ పరిధి గ్రామాలలో వారం రోజుల పాటు వైద్య శిభిరాలను నిర్వహించాలని వైద్యాధికారికి ఆదేశాలు జారీ చేశారు. కుమ్మరిపుట్టు, తలింబ, చీకుచింత గ్రామాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఇంటింటికి వెళ్లి అందుబాటులో ఉన్న బాలింతలను, చిన్నారులను, గర్భిణిలను పరిశీలించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. శీతాకాలంలో న్యుమోనియా వ్యాధి వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నదని, కావున అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరాల లోపు చిన్నపిల్లల్లోను, వృద్ధులలో, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో వ్యాధి వ్యాప్తిచెందే అవకాశం ఎక్కువగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిశువులకు చలి గాలులలో తిప్పరాదని, శరీరం మొత్తం గుడ్డలతో కప్పి ఉంచాలని, అనారోగ్య సమస్యలు వచ్చిన వెంటనే సమీప ఆసుపత్రి వైద్యాధికారులను సంప్రదించాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో ఎవ్వరికి అనారోగ్యం గురైతే తక్షణమే వైద్యులను సంప్రదించి వైద్య సేవలు పొందాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మరణాలు జరుగుతాయని ఆయన గ్రామస్తులకు సూచనలు సలహాలు అందించారు. అనంతరం కిలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సందర్శించి అన్ని వార్డులను, ప్రసూతి గదిని పరిశీలిన చేశారు. వైద్యం కొరకు వచ్చిన రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. పి.హెచ్.సి పరిధి గ్రామాలలో క్షేత్ర స్థాయి సిబ్బంది సందర్శనలు, అందిస్తున్న వైద్య సేవల గూర్చి వైద్యాధికారికి అడిగి తెలుసుకున్నారు. పి.హెచ్.సి పరిధిలోని ప్రసవాలు సిద్దంగా ఉన్న గర్భిణి స్త్రీలను వారం రోజుల ముందుగా గర్భిణి స్త్రీలకు ఆసుపత్రికి తరలించి సుఖ ప్రసవాలు జరుగునట్టు చర్యలు తీసుకోవాలని అన్నారు. పి.హెచ్.సిలో సుఖ ప్రసవాలు అధికంగా జరిపించాలని సిబ్బందికి సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యత గూర్చి, వ్యాధి నిరోధక టీకాల గూర్చి, పౌష్టికాహారం గూర్చి ముమ్మరంగా అవగాహన కలిపించాలని అన్నారు. అనంతరం ల్యాబ్ ను పరిశీలించి రోజువారిగా నిర్వహిస్తున్న రక్త పరీక్షలను పరిశీలించారు. ఇప్పటివరకు నమోదైన మలేరియా కేసుల వివరాలను, మలేరియా రోగులకు అందించిన చికిత్స గూర్చి అడిగి తెలుసుకున్నారు. పి.హెచ్.సి లో అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు మలేరియా, డయేరియా, టైఫాయిడ్, ఇతర వ్యాధులకు సంబంధించిన అత్యవసర మందులను, అన్నిరకాల వ్యాధినిరోధక వ్యాక్సిన్ లు ముందస్తు ఇండేంట్లను పంపి సరిపడా మందులను రప్పించి అందుబాటులో ఉంచుకోవాలని ఫార్మసిస్ట్ కు సూచించారు. అందుబాటులో ఉన్న అన్ని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్.సి వైద్యాధికారి శ్యాంప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నాషా ముక్త్ భారత్ అభియాన్
## ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా పాడేరు గావర్నమెంట్ డిగ్రీ కాలేజీలో అవగాహన కార్యక్రమం.



పాడేరు,పెన్ పవర్,నవంబర్ 18:గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, పాడేరులో నషా ముక్త్ భారత్ అభియాన్ (%చీవీదీూ%) ఐదేళ్ళు పూర్తైన సందర్భంగా ప్రత్యేక అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. భారత ప్రభుత్వం సామాజిక న్యాయ %బ% సాధికారత మంత్రిత్వ శాఖ ప్రారంభించిన ఈ జాతీయ కార్యక్రమం 2020 నుండి అమలులో ఉండి, యువతలో మాదకద్రవ్యాల వినియోగాన్ని తగ్గించడం, మత్తు పదార్థాల దుర్వినియోగాన్ని నివారించడం, సమాజంలో అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యాలుగా పనిచేస్తోంది. ముఖ్యంగా విద్యాసంస్థల్లో యువతను "డ్రగ్ లేని భారతదేశం" కోసం మార్గదర్శకులుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమంలో ప్రధాన భాగం.

ఈ కార్యక్రమం కాలేజీ సెమినార్ హాల్‌లో నిర్వహించబడింది. విద్యార్థులు, బోధనా మరియు అభ్యాసేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలేజ్ ప్రిన్సిపాల్ డా. వి. చిట్టిబ్బాయి సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ గిరిజన మరియు గ్రామీణ ప్రాంతాల్లో మాదకద్రవ్యాల ప్రభావాన్ని అరికట్టడం ఎంత ముఖ్యమో వివరించారు. మత్తుపదార్థాలు ఆరోగ్యం, విద్య, కుటుంబం మరియు వ్యక్తి భవిష్యత్తుపై చూపే దుష్ప్రభావాలను వివరించి, విద్యార్థులు జాగ్రత్తగా ఉండి తమ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.

%చీవీదీూ% కోఆర్డినేటర్ డా. డి. గణేష్ ప్రధాన మాట్లాడుతూ గత ఐదేళ్లలో నషా ముక్త్ భారత్ అభియాన్ యొక్క లక్ష్యాలు, కార్యక్రమాలు, గ్రామస్థాయి అవగాహన, యువత భాగస్వామ్యం, కౌన్సెలింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి చర్యలను వివరించారు. మత్తు పదార్థాల ప్రమాదాలు, వ్యసనం యొక్క ప్రారంభ లక్షణాలు, అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ సర్వీసులు, మరియు యువత పాత్ర వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య ఆకర్షణగా అన్ని విద్యార్థులు, బోధనా మరియు అభ్యాసేతర సిబ్బంది కలిసి డ్రగ్ ఫ్రీ ఇండియా ప్రతిజ్ఞ స్వీకరించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ లక్ష్యాలకు కాలేజ్ వర్గం ఇచ్చిన మద్దతును ఈ ప్రతిజ్ఞ స్పష్టంగా ప్రతిబింబించింది. చివర్లో విద్యార్థులతో చిన్న చర్చా సమావేశం జరగగా, వారు తమ గ్రామాలలో మరియు సమాజంలో %చీవీదీూ% సందేశాన్ని ప్రచారం చేయడానికి ముందుకు రావాలని సంకల్పం వ్యక్తం చేశారు. కాలేజ్ మొత్తం సిబ్బంది సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

## దక్షిణ నియోజకవర్గంలో కమిటీల ఏర్పాటు పరిశీలన వాసుపల్లి గణేష్ కుమార్ పర్యటన





విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 18 :విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గంలో వైఎస్ ఆర్సీపీ సంస్థాగత బలోపేతం లక్ష్యంగా బూత్, వార్డు కమిటీల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ సూచించారు. పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన స్పష్టమైన ఆదేశాల మేరకు, నిజంగా కష్టపడే కార్యకర్తలకు కమిటీ ల్లో ప్రాధాన్యత కల్పించాలని ఆయన వార్డు అధ్యక్షులకు సూచనలు జారీ చేశారు.39, 38, 35వ వార్డుల్లో పర్యటించిన వాసుపల్లి గణేష్ కుమార్, ఆయా వార్డు అధ్యక్షులతో సమావేశ మయ్యారు. 35వ వార్డు అధ్యక్షుడు కనక రెడ్డి ఇప్పటికే పూర్తి చేసిన కమిటీల వివరాలను ముందుగానే సమర్పించగా, అనంతరం 39వ వార్డు అధ్యక్షుడు ముజుబ్ ఖాన్, 38వ వార్డు అధ్యక్షుడు గురజాపు రవిని వారి కార్యాలయా ల్లో కలిసి కమిటీ ఏర్పాటు పురోగతిని పరిశీలించారు. కమిటీలు పార్టీ బలం పెంచే కీలక సంస్థల ని గుర్తుచేస్తూ, బూత్, వార్డు, అనుబంధ విభాగా ల్లో నిజాయితీగా పనిచేసే కార్యకర్తలకు తప్పని సరిగా చోటు కల్పించాలని వాసుపల్లి గణేష్ కుమార్ స్పష్టం చేశారు. త్వరితగతిన పూర్తి చేసిన కమిటీల నివేదికలను సమర్పించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ జిల్లా సెక్రటరీ అల్లిరెడ్డి ఆదివిష్ణు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ససపల రవీంద్ర భరత్, దక్షిణ నియోజకవర్గ నాయకులు, వార్డు నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జగన్ అండ్ కో తప్పుడు ప్రచారం

- సీఐఐ పెట్టుబడుల సదస్సు రాష్ట్రానికి భారీ అవకాశాలు తీసుకొచ్చింది
- జిల్లా టీడీపీ అధ్యక్షులు గండి బాబ్జి



విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 18 :సీఐఐ భాగస్వామ్య సదస్సు ఆంధ్రప్రదేశ్‌కు చారిత్రాత్మకమైన పెట్టుబడులను రాబట్టిందని, అయితే దీనిపై జగన్ అండ్ కో దుష్ప్రచారం చేస్తోందని జిల్లా టీడీపీ అధ్యక్షులు, రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి అన్నారు.జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మొత్తం 613 ఒప్పందాలు కుదిరాయి, అందులో వందకు పైగా సంస్థలు విశాఖ చుట్టుపక్కల ఏర్పడనున్నాయి అని వెల్లడించారు. చంద్రబాబు, లోకేష్ శ్రమ వల్లే నేడు ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూస్తోంది. రాష్ట్రం 2040 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీ వైపు దూసుకెళ్తుంది, అని ఆయన అన్నారు.వైసీపీ పాలనలో పరిశ్రమలు ఏమాత్రం రాలేదని, వచ్చిన పెట్టుబడులపై తాము చేస్తున్న విమర్శలు బలహీనంగా, పచ్చి అబద్ధాలుగా ఉన్నాయని గండి బాబ్జి మండిపడ్డారు. "గూగుల్ వస్తే నీళ్లు, కరెంట్ ఖర్చవుతుందని జగన్ అన్నారు. కానీ మరుసటి రోజే గూగుల్‌ను తామే తెచ్చామని చెప్పుకోవడం ఎంతవరకు సమంజసం?" అని ప్రశ్నించారు.

వైద్య కళాశాలలపై వైసీపీ చేస్తున్న నిరసనలు నాటకమని వ్యాఖ్యానిస్తూ రుషికొండ కోసం శత కోట్లు ఖర్చు చేశారు. ఆ డబ్బే మెడికల్ కాలేజీల కు ఎందుకు ఉపయోగించలేదు ఇప్పుడు ప్రజ లు వైసీపీని ఇంటికే పరిమితం చేశారు. అయినా బుద్ధి రావడం లేదు, అని గండి బాబ్జి విమర్శిం చారు.విశాఖలో ప్రస్తుత పెట్టుబడుల ప్రవాహాన్ని వివరించిన ఆయన సబ్బవరం న్యాయ విశ్వవిద్యాలయం పక్కన కొత్త ఐటీ పరిశ్రమ,తుర్లవాడ వద్ద మరో ఐటీ సంస్థ,దువ్వాడలో విస్తృత ప్రదేశంలో ఐటీ సంస్థకు స్థలం కేటాయింపు,విశాఖలో భారీగా ఐటీ, ఏఐ సంస్థలు రాబోతున్నాయన్నారు.

అదేవిధంగా రాబోయే నెలల్లో పెద్ద ఎత్తున మౌలిక వసతుల అభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు.దువ్వాడ,సబ్బవరం జాతీయ రహదారి,నక్కపల్లి,సబ్బవరం,విజయనగరం రింగ్ రోడ్డులు, కొత్త నివాస సముదాయా లు, బహుళ అంతస్తుల భవనాలు వేగంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు.

విశాఖకు మెట్రో అవసరం. ఇది నగర అభివృద్ధికి మణిహారం. కొమ్మాది,కూర్మన్నపాలెం మధ్య ఎలివేటెడ్ కారిడార్ ద్వారా ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. మెట్రో, రోడ్డు రవాణా వ్యవస్థలను సమగ్రంగా అభివృద్ధి చేస్తాం," అని గండి బాబ్జి తెలిపారు.

ఈ సమావేశంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు అవుగడ్డ అప్పలనాయుడు పాల్గొన్నారు.

## శిష్టకరణల కార్తీక వనసమారాధన



గాజువాక : పెన్ పవర్ ,నవంబర్ 18 శిష్టకరణ సంఘం రిజిస్టర్ నెంబర్ 354/99 వారి ఆధ్వర్యంలో అగనంపూడి సీతారామాలయం వద్ద నిర్వహించిన పిక్నిక్ కు 1300 మందికి పై గా గాజువాక శిష్టకరణ కుటుంబ సభ్యులు గాజువాక నలుదిక్కులనుండి విచ్చేసినందున ఎంతో సువిశాల ప్రాంగణం ఆహ్లాదవాతావరణం చోటుచేసుకుంది .

కుల ఐక్యత ను చాటి చెప్పే నినాదాలతో ప్రాంగణం దద్దరిల్లిపోయింది.ప్రాంతీయ భేదాలు, రాజకీయ హద్దులు లాంటి చిచ్చు పెట్టె విషపూరిత మాటలను మదిలో పెట్టినా,లెక్కచేయక ఐకమత్యం గా పిక్నిక్ కు వచ్చి కుల బలాన్ని నిరూపించి.సాటి కులాల ముందు కుల గౌరవాన్ని నిలిపారని , సాయంత్రం 6:30 గంటల వరకు ఉండి ఖరీదైన బహుమతులను పొందడమే కాకుండా అన్నివిధాల సంఘము వారికి సహకరించినందుకు ప్రతీ ఒక్కరికి సంఘం ప్రతినిధులు ధన్యవాదములు తెలిపారు .

## నేడు పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ నిధుల జమపై లైవ్ కార్యక్రమం

మండల వ్యవసాయ అధికారి డి. గిరిబాబు



గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 18:పీఎం కిసాన్ మరియు అన్నదాత సుఖీభవ పథకాల కింద రైతులకు జమ కానున్న నిధుల నేపథ్యంలో బుధవారం (19-11-2025) మధ్యాహ్నం 2 గంటలకు మండలంలో ప్రత్యేక లైవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.వివరాల్లోకి వెళితే, ఈ లైవ్ కార్యక్రమాన్ని ప్రతి రైతు సేవా కేంద్రం అలాగే గ్రామ సచివాలయాల్లో ఏర్పాటుచేసినట్లు అధికారులు వెల్లడించారు. రైతులకు నిధుల జమ ప్రక్రియ, పథకాల లాభాలు, తాజా వివరాలు అందించడానికి ఈ ప్రత్యక్ష ప్రసారం ఉపయోగపడనుంది.ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు,పేసా నాయకులు, అలాగే మండల, గ్రామ స్థాయి నాయకులు హాజరు కావాలని వ్యవసాయ అధికారి డి. గిరిబాబు కోరారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ 19-11-2025( బుధవారం )మధ్యాహ్నం 2 గంటలకు పీఎం కిసాన్ (21 వ విడత )నిధులు గూడెం కొత్త వీధి మండలం నకు 9160 రైతులకు 1,83,20,000 /- అదేవిధంగా అన్నదాత సుఖీభవ 2 వ విడత నిధులు 9902 రైతులకు 4,95,10,000 మొత్తం:6,78,30,000/- వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని ఈ కార్యక్రమం ను ప్రతి రైతు సేవా కేంద్రంలో ప్రత్యక్ష ప్రసారం జరుగుతుంది అని తెలిపారు.

## కణితి హై స్కూల్ లో జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ సెలక్షన్ పోటీలు ప్రారంభం






కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,నవంబర్ 18 గాజువాక నియోజకవర్గం 87వ వార్డ్ పరిధిలో కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ సెలక్షన్ పోటీలు ప్రారంభం అయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాథం పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలో ఉన్న అండర్ - 14 బాల బాలికలను హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక ప్రక్రియ కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించడం ఆనందకరంగా ఉందని, గతంలో రాష్ట్రస్థాయి అండర్ - 14 నెట్ బాల్ పోటీలో ఇక్కడ నిర్వహించడం జరిగిందని ,అందులో కణితి స్కూలుకు ప్రథమ బహుమతి రావడం జరిగిందని గుర్తు చేసుకున్నారు. పిల్లలు చదువుతో పాటు క్రీడలలో మంచి ప్రతిభ కనపర్చాలని ఇంత మంచి కార్యక్రమంలో భాగస్వామ్యం చేసిన స్కూల్ యాజమాన్యం వారికి ధన్యవాదములు తెలియజేశారు .అనంతరం పిల్లలను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. కార్యక్రమం లో ఎస్ జి ఎఫ్ అఫిషియల్ సెక్రెటరీ వై యామిని ,పద్మనీ ప్రియ, హెచ్ఎం , కణితిపిడీఎస్ , అల్ పిడీఎస్ , వార్డ్ అధ్యక్షుడు విజయరామరాజు, లెనిన్ బాబు, ఆనంద్ కుమార్, భాగ్య లక్ష్మి,బోండా శ్రీను, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## 15వ ఆర్థిక సంఘం నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఎంపీడీవో, సెక్రటరీకు వినతి పత్రం సమర్పించిన గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను. పీసా అధ్యక్ష కార్యదర్శులు.



ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబర్ 18.మండలంలో గల కించాయిపుట్టు పంచాయితీలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులతో త్రాగు నీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, జంగిల్ క్లియర్, పరిశుధ్యా మెరుగుకు పారదర్శకంగా ఖర్చుపెట్టి అన్ని గ్రామాల అభివృద్ధికి నిధులు ఖర్చు చేయాలని కించాయిపుట్టు పంచాయితీ పీసా అధ్యక్ష కార్యదర్శులు, ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను మండల అభివృద్ధి అధికారి కి ధర్మారావుకు, పంచాయితీ కార్యదర్శి సింహాచలంలకు వేరు వేరుగా మంగళవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. పంచాయితీ పరిధిలోని ప్రతి గ్రామంలో గ్రామ సభలు ఏర్పాటు చేసి ఏఏ గ్రామంలో ఏ సమస్యలు ఉన్నవో గుర్తించి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15 ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు, త్రాగు నీరు డ్రైనేజీ వ్యవస్థ జంగిల్ క్లియరెన్స్ గ్రామంలో నెలకొన్న పారిశుద్ధ్య పనులు మెరుగు కు ఆర్థిక సంఘం నిధులు వెచ్చించి గ్రామాల అభివృద్ధి చేయాలని వారు అన్నారు. పంచాయితీ పరిధిలో సిసి రోడ్లు డ్రైనేజీ త్రాగునీరు మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు అన్నారు. వినతి పత్రం స్వీకరించిన ఎంపిడిఓ ధర్మారావు, పంచాయితీ కార్యదర్శి సింహాచలం స్పందిస్తూ..15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామ అభివృద్ధికి చర్యలు చేపడుతామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రాములు, కించాయిపుట్టు, ముంచంగిపుట్టు పీసా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కిల్లో నారాయణ, కిల్లో పద్మనాభం, పూజారి సుబ్బారావు, రొబ్బ పద్మనాభం, పంచాయితీ పలు గ్రామాల ప్రజలు రామ్ చందర్ బుద్ధ కిల్లో రామ్మూర్తి వెంకట్ ప్రసాద్ మధ్య ప్రసాద్ తో పాటురాములు గద్దిబంద కించాయిపుట్టు ప్రజలు పాల్గొన్నారు.

## జీకే వీధి మండల గిరిజన ఉద్యోగుల సంఘం - ఏకగ్రీవ కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షునిగా దొండ వెంకట కాశీశ్వరరావు

గూడెం కొత్తవీధి, పెన్ పవర్, నవంబర్ 18: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల గిరిజన ఉద్యోగుల సంఘం కొత్త కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మంగళవారం జరిగిన సమావేశంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు లోచల రామకృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాగిన పూర్ణచంద్రరావు, మండల పూర్వ అధ్యక్షులు ముర్ల వెంకటరమణ, సంఘ పెద్దలు ముక్కుల కామేశ్వరరావు పర్యవేక్షణలో ఎన్నికలు అమలు చేయబడ్డాయి. ఈ ఎన్నికల్లో సంఘ సభ్యులందరూ ఏకగ్రీవంగా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.మండల గిరిజన ఉద్యోగుల సంఘ అధ్యక్షుడుగా దొండ వెంకట కాశీశ్వరరావు, గౌరవ అధ్యక్షుడుగా పాతును రామరాజు,ఉపాధ్యక్షుడిగా చెర్రీకె వెంకటేశ్వర్లు,ప్రధాన కార్యదర్శిగా కొర్ర మల్లేశ్వరరావు,సంయుక్త కార్యదర్శిగా మర్రి సత్యనారాయణ,కోశాధికారిగా రెడ్డి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నిక కాబడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఉద్యోగ-ఉపాధ్యాయ సంక్షేమం కోసం ప్రతి శాఖతో సమన్వయం చేస్తూ త్వరలోనే పూర్తి స్థాయి శాఖవారీ కార్యవర్గాన్ని ప్రకటిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని నూతన కమిటీకి తమ మద్దతు తెలిపారు.

# ఏపీ ఎఫ్ డి సి కాఫీ కార్మికుల సమ్మె తాత్కాలికంగా విరమణ





* విధుల్లోకి చేరిన కార్మికులు .
* 30వ తేదీ లోపు సమస్యలు పరిష్కరించకపోతే మళ్లీ సమ్మె హెచ్చరిక.

**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 18 :-** ఏపీ ఎఫ్ డి సి కాఫీ కార్మికుల సమ్మె తాత్కాలికంగా విరమణ చేసినారు గత 12 రోజులుగా కొనసాగుతున్న తాత్కాలిక కార్మికులు%-%హెల్పర్ల సమ్మె సోమవారం విరమించినారు మంగళగిరిలో జరిగిన %జవవసఎబ%లో హాజరైనారు సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ డా. వై.ఎస్. శ్రీధర్ ఇచ్చిన హామీ నేపథ్యంలో పనుల్లోకి తిరిగి విధులో చేరుతున్నట్టు సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ ప్రకటించారు.

చింతపల్లి మండలం వంగసార తోటలో కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ లోపు ఎండి చింతపల్లి డివిజనల్ కార్యాలయానికి వచ్చి కాఫీ కార్మికులతో నేరుగా చర్చలు జరపాలని కోరామని, మహా అయితే ఆ సమయానికి రాని పక్షంలో మళ్లీ సమ్మె తప్పదని స్పష్టం చేశారు.

17వ తేదీన సిఐటియు ప్రతినిధుల బృందం రాష్ట్ర రాజధాని అమరావతిలో ఎండి డా. శ్రీధర్‌ను కలిసి కార్మికుల సమస్యలు, 10 కోర్కెలతో కూడిన వినతి పత్రాన్ని అందజేసింది. 12 రోజులుగా జరుగుతున్న సమ్మె విషయమై తమకుసమాచారం అందలేదని ఎండి స్పందించడంతో యూనియన్ ప్రతినిధులు నవంబర్ 6న ఇచ్చిన సమ్మె నోటీసు, గత అగ్రిమెంట్ అమలు కాకపోవడం, ప్రత్యర్థి సంఘంతో చేసిన ఒప్పందాల గురించి వివరించారు.

రోజూ కూలి 500రూ,, కంటే తక్కువ కాకుండా నిర్ధారించాలి, కాఫీ పండ్ల సేకరణ రేట్లను పెంచాలి, తోటల సంరక్షణ కోసం అవసరమైన సిబ్బందిని తిరిగి నియమించాలి. వంటి కీలక డిమాండ్లపై ఎండి సమగ్రంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. గ్రూపు ఇన్సూరెన్స్ పరిధిలో ప్రమాద మరణ పరిహారాన్ని 2 లక్షల నుంచి 5 లక్షలకు పెంచినట్లు తెలిపారు. పర్మినెంట్ కార్మికుల క్వార్టర్ల మరమ్మతులకు త్వరలోనే బడ్జెట్ విడుదల చేస్తామని కూడా చెప్పారు. కొన్ని తోటల్లో ప్లాంటేషన్ కండక్టర్లకు జారీ చేస్తున్న నోటీసులపై కూడా యూనియన్ దృష్టికి తీసుకెళ్లగా, అన్ని సమస్యలను పరిశీలించి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని ఎండి స్పష్టం చేసినట్టు ప్రతినిధులు తెలిపారు. చర్చలకు హామీ నేపథ్యంలో కాఫీ యార్డులు, నర్సరీలు, తోటల పనుల్లోకి కార్మికులు తిరిగి చేరుతున్నట్టు యూనియన్ ప్రకటించింది. అయితే ఎండి పర్యటన అనంతరం పరిస్థితిని పరిశీలించి అవసరమైతే మళ్లీ సమ్మెకు దిగేందుకు వెనకాడబోమని హెచ్చరించారు.

అమరావతిలో జరిగిన చర్చలకు లింగేరి సుందర్ రావు, మోరి వెంకటగిరి, వెంకటేష్, కనకవల్లి, కాంతమ్మ, నాయుడు, కాంతారావు, బాలకృష్ణ, పాపారావు, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# త్రాగు నీటి సరఫరా లో నీటి నాణ్యతా పరీక్షలు నిత్యం నిర్వహించాలి.





* నీటి పంపింగ్ స్టేషన్ల నిర్వహణను మెరుగుపరచండి : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.

**గాజువాక: పెన్ పవర్,నవంబర్ 18** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో గల అన్ని నీటి సరఫరా పంపింగ్ స్టేషన్ల నిర్వహణను మెరుగుపరచాలని, ప్రజలకు నిత్యం అందిస్తున్న తాగునీటి సరఫరా లో నీటి నాణ్యతా పరీక్షలు పంపింగ్ స్టేషన్లలో నిత్యం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ నీటి సరఫరా ఇంజనీర్లకు కమిషనర్ ఆదేశించారు. మంగళవారం ఆయన జోన్ - 6 గాజువాక సుందరయ్య కాలనీ లో గల 10 ఎమ్.జి.డి కెపాసిటీ పంపింగ్ స్టేషన్ ను జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు పి.వి.వి.సత్యనారాయణ రాజు, జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి లతో కలిసి పరిశీలించారు. ఈ పరిశీలనలో కమిషనర్ ముందుగా పంపింగ్ స్టేషన్ అంతా కలియతిరిగి స్కాడా యస్ సి ఎం డి ఎ- సూపర్వైజరి కంట్రోల్ అండ్ డాటా అక్విజిషన్ స్టేషన్ , పంపు ఆపరేషన్ సిస్టం, పవర్ కంట్రోల్ రూమ్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, వాటర్ సప్లై పంపింగ్ స్టేషన్ మ్యాప్ లను పరిశీలించిన అనంతరం 10 ఎమ్. జి . డి .కెపాసిటీ పంపింగ్ స్టేషన్ కు చేరుతున్న నీరు కెపాసిటీ, ఫిల్టర్ అనంతరం విడుదలవుతున్న నీటి కెపాసిటీ, వాటి నాణ్యత , గాజువాక తాగునీటి సరఫరా ప్రక్రియ తదితర వివరాలను పి పి టి ద్వారా ఇంజనీరింగ్ నీటి సరఫరా అధికారుల వివరించగా కమిషనర్ క్షుణ్ణంగా వాటిని పరిశీలించి పలు విషయాలపై చర్చించారు . ప్రజలకు నిత్యం అందించే నీటి సరఫరా కు సంబంధించి అన్ని పంపింగ్ స్టేషన్ల లో నీటి నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తూ నీటి నాణ్యతా ప్రమాణాలను నిత్యం పాటించేలా చర్యలు ఇంజనీర్లు చేపట్టాలన్నారు . నీటి నాణ్యత పరీక్షలను స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ పద్ధతిలో చేపట్టాలని ,నిత్యం శాంపిల్స్ జరపాలని, ల్యాబ్ లకు పంపించాలని సంబంధిత రికార్డులో ఆయా వివరాలను నమోదు జరిగేలా చర్యలు చేపట్టాలని నీటి సరఫరా విభాగం ఇంజనీర్లకు కమిషనర్ ఆదేశించారు. పంపింగ్ స్టేషన్ల నిర్వహణలో చేపడుతున్న అన్ని ప్రక్రియలను తెలుసుకునేందుకు వార్డు ఎమినిటీస్ కార్యదర్శులకు శిక్షణను ఇచ్చి వారికి నీటి సరఫరా నిర్వహణ ప్రక్రియలో పూర్తి అవగాహనను కల్పించాలన్నారు. నీటి నాణ్యత పరీక్షలకు సంబంధించి ఒక లేబోరేటరీను ఏర్పాటు చేసుకున్నట్లయితే నీటి నాణ్యత పరీక్షలకు సంబంధించి వివరాలను వెంటనే తెలుసుకునేందుకు వీలుగా ఉంటుందని పర్యవేక్షక ఇంజనీర్ ఏడుకొండలు కమిషనర్ కు సూచించగా.., అందుకు సంబంధించిన అన్ని ప్రమాణాలతో కూడిన లేబరేటరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రధాని ఇంజనీర్ కు కమిషనర్ సూచించారు. పంపింగ్ స్టేషన్ల లో జరుగుచున్న నీటి సరఫరా నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలని, పంపింగ్ స్టేషన్ల లో పరిశుభ్రతను పాటిస్తూ ,పచ్చదనాన్ని పెంపొందించుకోవాలని , అలాగే ప్రజలకు అందిస్తున్న నీటి సరఫరాకు సంబంధించి నీటి చార్జీలను నిర్ణీత కాలంలో వసూలు చేసుకుని నీటి సరఫరా నిర్వహణకు ఆర్థిక పరిపుష్టిని అభివృద్ధి పరచుకోవాలని, ఆ దిశగా నీటి చార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధాన ఇంజనీర్ కు కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్కాడ స్టేషన్ నిర్వాహక ఏజెన్సీ ప్రతినిధి రమేష్ ,కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాస్, సహాయక వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్, వార్డ్ ఎమినిటీస్ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల పక్షాన పేదల పక్కన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆర్థిక సహాయం





* ఆరు మందికి రూ.40,000 ఆర్థిక సాయం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 18 :** ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం పేద కుటుం బాలకు ఆర్థికంగా అండగా నిలిచారు. విశాఖ నగర జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వివాహ ఖర్చులు, వైద్య ఖర్చు లు, వాహనం మరమ్మతు వంటి అత్యవసర అవసరాల నిమిత్తం మొత్తం రూ. 40,000 సాయం అందించారు. ఈ ఆర్థిక సహాయం ద్వారా ప్రయోజనం పొందిన వారు:హరీష్ 36వ వార్డు ఆటో మరమ్మత్తు)బషీర్ 36వ వార్డు హాస్పిటల్ ఖర్చులు)రాజయ్య 30వ వార్డు వైద్య ఖర్చులు)జరీనా బేగం 39వ వార్డు కుమార్తె వివాహం,రితిక 37వ వార్డు వైద్య ఖర్చు లు,సాహిల్ 37వ వార్డు (వైద్య ఖర్చులు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రజల సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దే దుకు నిరంతరం ప్రజాక్షేత్రంలో పనిచేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. పేద కుటుంబాలకు ఇలాంటి సహాయం కొనసాగుతుందని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కూటమి కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ కార్యక ర్తలు పాల్గొన్నారు.

# కేజీబీవీ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

* విద్యార్థినులతో భోజనం చేసిన ఎమ్మెల్యే గంటా



**భీమిలి,పెన్ పవర్,నవంబర్ 18 :** భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళ వారం కేజీబీవీ హైస్కూల్‌లో ఆకస్మిక పరిశీ లనలు నిర్వహించారు. విద్యార్థినులకు అంది స్తున్న భోజనం నాణ్యతను ప్రత్యక్షంగా తెలుసు కునేందుకు ఆయన స్వయంగా వారితో కలిసి భోజనం చేశారు. భోజన పదార్థాలు ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా వాడుతున్నారా అనే అంశంపై విద్యార్థినులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. తరగతి గదులు, డైనింగ్ హాల్, వసతిగృహం సహా పాఠశాలలోని అనేక సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలకు కావా ల్సిన మౌలిక వసతులందించడంలో స్థానిక నాయకుడు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ స్వచ్ఛందంగా సహకరిస్తున్నారని ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఏవైనా సమస్యలు ఉన్న వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని, విద్యార్థినుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

# ఏపీఎస్ ఆర్టీసీ ధనుర్మాస ప్రత్యేక బస్సులు

* ధనుర్మాసం సందర్భంగా విశాఖపట్నం ఏపీఎస్ఆర్టీసీ ప్రముఖ వైష్ణవ క్షేత్రాల యాత్రలు
* రీజనల్ మేనేజర్ ఏపీఎస్ఆర్టీసీ బి అప్పలనాయుడు



**విశాఖ తూర్పు,పెన్ పవర్, నవంబరు 18:** ధనుర్మాసం సందర్భంగా విశాఖపట్నం ఏపీఎస్ఆర్టీసీ ప్రముఖ వైష్ణవ క్షేత్రాలైన ద్వారకాతిరుమల అప్పనపల్లి ద్వారకాతిరుమల, అంతర్వేది, జి మామిడాడ, మరియు అన్నవరం క్షేత్రాలను కలుపుతూ పంచవైష్ణవి క్షేత్ర దర్శిని బస్సులను ప్రతి శుక్రవారం రాత్రి బయలుదేరి శనివారం నాడు దర్శించుకుని వచ్చే విధంగా టూర్ ప్యాకేజి సిద్ధం చేసామని,భక్తులు ఈ యొక్క సదవకాశాన్ని వినియోగించుకో వాలని,మనిషి ఒక్కరికి సూపర్ లగ్జరీ చార్జి:1800/- ,ఈ బస్ లు తేది:21.11.25 %d% 28.11.25 మరియు 05.12.25. 12.12.25 తేదిలలో బస్సులు నడుపుతున్నారని,భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసినదిగా రీజనల్ మేనేజర్ ఏపీఎస్ ఆర్టీసీ బి. అప్పలనాయుడు. తెలియజేశారు. వివరాలకు దిగువన ఇవ్వబడిన ఫోన్ నెంబర్:8309265666,9959225594.లను సంప్రదించవచ్చు

# సి ఐ ఐ సమ్మిట్ విజయంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న ప్రతిపక్షం కు కౌంటర్ ఇచ్చిన తెలుగుదేశం



**గాజువాక పెన్ పవర్, నవంబర్ 18**

సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయాన్ని చెడగొట్టడానికి తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని . టి ఎన్ యస్ ఎఫ్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు రతన్ కాంత్ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌కు భారీ స్థాయిలో పెట్టుబడులు, ఉద్యోగాలు వచ్చే ఈ సమయంలో ప్రతిపక్షం దారి మళ్లించే ప్రయత్నాలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. సమ్మిట్‌లో భారీ పెట్టుబడులు %-%భారీ అవకాశాలు వస్తాయన్నారు.

ఈ సదస్సులో మొత్తం 13.25 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు,

సుమారు 16 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించే అవకాశం ఉందని రతన్ కాంత్ తెలిపారు.

పెట్టుబడులు ముఖ్యంగా పోర్టులు, ఇండస్ట్రియల్ కారిడార్లు, లాజిస్టిక్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఐటీ, ఎనర్జీ రంగాల్లో ఉండనున్నాయని తెలిపారు.

అంతర్జాతీయ స్థాయి పాల్గొనటం

సమ్మిట్‌కు 4971 మంది ప్రతినిధులు, 30 దేశాలు, 300 కంపెనీలు పాల్గొనడం రాష్ట్రానికి గౌరవమనిఅభిప్రాయపడ్డారు.

ఇది ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల మ్యాప్‌లో మళ్లీ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నట్లు అన్నారు. యువజన శ్రామిక శాఖ, పరిశ్రమ శాఖ కలిసిసదస్సు విజయవంతం కావడానికి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు రతన్ కాంత్ పేర్కొన్నారు.

పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడం ముఖ్య కారణమని అన్నారు. గత ప్రభుత్వంపై తీవ్రమైన విమర్శలు చేసారు. గత ప్రభుత్వ కాలంలో పెట్టుబడివాతావరణంబలహీనపడటం,విద్యుత్ కొరత,లా అండ్ ఆర్డర్ లోపాలు పరిశ్రమలను దూరం చేశాయని రతన్ కాంత్ విమర్శించారు.

ప్రస్తుత ప్రభుత్వం ఆ సమస్యలను పరిష్కరించి పెట్టుబడిదారులకు విశ్వాసం కల్పించిందన్నారు. సీఐఐ సదస్సు ద్వారా వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలు త్వరలోనే గ్రౌండ్ లెవెల్ ప్రాజెక్టులుగా మారే అవకాశం ఉందని,

ఈ పెట్టుబడులు యువతకు భారీ అవకాశాలు తెస్తాయని తెలిపారు.

"తప్పుడు ప్రచారాలకు లోనుకాకుండా నిజాలను అర్థం చేసుకొని రాబోయే అవకాశాలపై దృష్టి పెట్టాలి"

అని విద్యార్థులకు టి ఎన్ యస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రతన్ కాంత్ సూచించారు.

# దారెల పంచాయతీలో శిశు మరణాలపై గ్రామాల్లో పర్యటించిన మండల తహసిల్దార్

- గ్రామలలో ఎవరికైనా అనారోగ్యానికి గురైతే తక్షణమే ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందాలి.
- మండల తహసిల్దార్ భాస్కర అప్పారావు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబర్ 18.** మండల పరిధిలో గల దారేల పంచాయితి డి కుమ్మరిపుట్టు తలింబ, చివుకుచింత గ్రామాల్లో నెల రోజుల వ్యవధిలో ఐదుగురు చిన్నారుల మరణాలపై మండల తహసిల్దార్ భాస్కర అప్పారావు పర్యటించి మరణాలకు సంబంధించిన చిన్నారుల కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ.. గ్రామంలో ఎవరికైనా అనారోగ్యానికి గురైతే తక్షణమే వైద్యులకు సంప్రదించి వైద్య సేవలు పొందాలని సూచించారు. ఆరోగ్యం బాగు లేకపోతే ఇంటి వద్ద ఎవరు ఉండకుండా ఆసుపత్రికి వెళ్లివైద్య సేవలు పొందాలని ఆయన అన్నారు. చలి తీవ్రత ఉన్న నేపథ్యంలో చిన్నారులు వృద్ధులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని ఆయన పలు సూచనలు సలహాలు అందించారు. గ్రామంలో అందుబాటులో ఉండే ఆశా కార్యకర్తలను సంప్రదిస్తే ఆసుపత్రులకు తీసుకుని వెళతారని అనారోగ్యానికి గురైతే నిర్లక్ష్యంగా ఉండరాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ కె భాస్కరరావు, ఆశ కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

# బెహరాను మహా రుద్రాభిషేకానికి ఆహ్వానించిన ఆలయ అర్చకులు

కాత్యాయని సమేత త్రికంటి భీమేశ్వర ఆలయంలో మహా రుద్రాభిషేకం





విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 18 : పశ్చిమ నియోజకవర్గం, జీవీఎంసీ, 92వ వార్డు, గోపాలపట్నం మెయిన్ రోడ్, నరసింహనగర్‌లో ఉన్న శ్రీ కాత్యాయని సమేత త్రికంటి భీమేశ్వర స్వామివారి దేవస్థానంలో కార్తీక మాసం శోభ అయిదింతలు పెరిగింది. మాస శివరాత్రి సందర్భంగా నిర్వహించిన మహా రుద్రాభిషేకానికి జనసేన పార్టీ నాయకుడు బెహరా భాస్కరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. దేవాలయ ప్రధాన అర్చకులు మిర్యాల సుబ్రహ్మణ్య శర్మ గారు భాస్కరరావు గారిని స్వయంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలలో పాల్గొనే అవకాశం కల్పించారు. ఆలయంలో వేదఘోషాలతో, రుద్రపఠనంతో నిర్వహించిన ఈ మహా రుద్రాభిషేకంలో ముందుగా భాస్కరరావు చేతుల మీదుగా స్వామివారికి అభిషేకం చేయించడం విశేషం. అనంతరం ఆయనకు దేవస్థాన తీర్థప్రసాదాలు అర్పించి అర్చకులు ఆశీర్వచనాలు అందించారు.

ఈ కార్యక్రమంలో కడిమి రామకృష్ణ, బండారు శ్రీనివాసరావు, మార్కండేయ రాజశేఖర్ తదితరులు పాల్గొనడమే కాకుండా జనసేన పార్టీ నాయకులు, స్థానిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్త జనసంద్రం మధ్య శివాలయ ప్రాంగణం భక్తిరసమయం అయ్యింది. కార్తీక మాసం నేపథ్యంలో భక్తులు స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో విచ్చేస్తుండగా, ఆలయ నిర్వహణ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సమాజానికి ఆధ్యాత్మిక విలువలను చేరవేయడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో కీలకమని అర్చకులు తెలిపారు.?

# యాంటీబయాటిక్ వాడకాన్ని తగ్గించాలి ర్యాలీని ప్రారంభిస్తున్న అతిథులు

**సీతానగరం, పెన్ పవర్, నవంబర్ 18:** రోగులకు యాంటీబయాటిక్‌ల వాడకాన్ని తగ్గించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఏవీకే చైతన్య సూచించారు. ప్రపంచ ఔషధ నిరోధక అవగాహన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం డాక్టర్ యేసు రాణి ఆధ్వర్యంలో మండలంలోని అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించడంతో పాటు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఔషధ నిరోధకతకు అనవసరంగా మందులు వాడడం, అవసరమైనంత మోతాదులో మందులు వాడకపోవడం ప్రధానమైన కారణాలన్నారు. సాక్ష్యం ఆధారితంగా మందు (ఎవిడెన్స్ బేస్డ్ మెడిసిన్)ను తీసుకుంటే డ్రగ్ రెసిస్టెన్స్‌ను నిరోధించవచ్చన్నారు.

మాట్లాడుతూ యాంటీ మైక్రోబియల్స్ ఎక్కువగా వాడటం వల్ల మన శరీరంలో ఉండే మంచి బ్యాక్టీరియా చనిపోతుందన్నారు. తద్వారా జీర్ణకోశ, చిన్నప్రేగు, పెద్దప్రేగు సమస్యలు ఉత్పన్నమవుతాయని, సొంత వైద్యం ప్రమాదకరమని, డాక్టర్ సలహా మేరకు మాత్రమే మందులను వాడాలన్నారు. ప్రతి వ్యక్తి పరిశుభ్రత పరిసరాల పోషకాహార వినియోగం పై శ్రద్ధ పెట్టాలని అన్నారు . ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ వైయస్ రాయుడు, సూపర్వైజర్ కే. సుధాకర్, ఎమ్ ఎల్ హెచ్ లు ఎన్ ఎమ్ లు ఆశా వర్కర్లు తదితర పాల్గొన్నారు.

# నాయి బ్రాహ్మణ సంఘం పెద్దలకు ఎమ్మెల్యేలు, మేయర్ ఘన స్వాగతం





## భవిష్యత్ కార్యాచరణపై హామీలతో ముగిసిన సమావేశం

## పండుగలా సాగిన కార్యక్రమం

**విశాఖపట్నం, నవంబర్** విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈరోజు జరిగిన ప్రత్యేక సమావేశం పండుగ వాతావరణాన్ని తలపించింది. నూతనంగా ఎన్నికైన విశాఖ జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం (రిజి. 500/82) ప్రతినిధులు నాలుగు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చలు జరిపారు.

**నాలుగు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులతో భేటీ..**

ఈ సందర్భంగా సంఘ నాయకులు కింది ప్రముఖులను భేటీ చేసి దుశ్శాలవాలుతో ఘనంగా సన్మానించారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ పీ.జీ.వి.ఆర్. నాయుడు (గణబాబు), భీమిలి ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావు, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, వి.ఎం.సీ మేయర్ పీల శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్త, తుమ్మిడి బ్రదర్స్ అధినేత తుమ్మిడి రామ్‌కుమార్ సంఘం తరఫున పెద్దలు హాజరయ్యారు. గౌరవ అధ్యక్షులు ముసిడిపల్లి రమణ, అధ్యక్షులు కోడూరు గణపతిరావు, ప్రధాన కార్యదర్శి %a% టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు నరవ పైడిరాజు, కోశాధికారిగా గోవాడ సురేష్ కుమార్, పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షులు గోల్కొండ కర్ణాకర్ సహా అనేక మంది పెద్దలు, నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. పుల్లేటికుర్తి సూర్యారావు, గోల్కొండ రామకృష్ణ, మల్లువలస వర్మ, చింతపల్లి సూర్య, బయ్యవరపు నర్సింగరావు, బల్లంకి వెంకట్రావు, నరవ ఈశ్వరరావు, వడ్డాది కనకరాజు తదితర ప్రముఖులు కార్యక్రమాన్ని మరింత విశిష్టం చేశారు.

**ప్రజాప్రతినిధుల హామీలు..**

భేటీలో ఎమ్మెల్యేలు, మేయర్ నాయి బ్రాహ్మణ సంఘానికి పలు ముఖ్య హామీలు ఇచ్చారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండుతుంది. మీ సమస్యలు ప్రభుత్వ స్థాయిలో ప్రత్యేకంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావు ఎండోమెంట్ దేవాలయాల్లో పాలక మండళ్లలో నాయి బ్రాహ్మణులకు ప్రతినిధిత్వం కల్పించేందుకు కృషి చేస్తాం. మీరు అర్హులైన హక్కులు మీకు ఖాయం" అని తెలిపారు.

దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ హామీలు సెలూన్ షాపులు నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుబాటులోకి తేవడంపై కృషి చేస్తాం. అలాగే దేవాలయ పరిపాలనలో కూడా మీకు తగిన చోటు కల్పిస్తాం" అని ప్రకటించారు. మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ పరిధిలో మీ సంక్షేమానికి సంబంధించిన ప్రతీ అంశంలో సహకారం అందిస్తాం. సంఘ అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తాం" అని పేర్కొన్నారు.

సంఘ పెద్దలు రమణ, గణపతిరావు, నరవ పైడిరాజు తదితరులు భవిష్యత్తులో చేపట్టాల్సిన సంక్షేమ కార్యక్రమాలు, సమస్యల పరిష్కార మార్గాలపై ప్రజాప్రతినిధులతో విస్తృతంగా మాట్లాడారు. అధిక సంఖ్యలో సంఘ పెద్దలు, నాయకులు పాల్గొనడంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా, పండుగ వాతావరణంలో సాగింది. నాయి బ్రాహ్మణ సమాజ అభ్యున్నతికి ఇది కీలక అడుగుగా నాయకులు అభిప్రాయపడ్డారు.





# మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా అనకాపల్లి జిల్లాలో దృఢ అడుగు





## అభ్యుదయ సైకిల్ ర్యాలీతో జిల్లావ్యాప్తంగా చైతన్యం

**అనకాపల్లి, పెన్ పవర్, నవంబర్ 18 :** మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డ్రగ్స్ అవేర్నెస్ క్యాంపియన్లో భాగంగా అభ్యుదయ సైకిల్ ర్యాలీ"ను అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డ్ వద్ద ఘనంగా ప్రారంభించారు. విద్యార్థులు, అధికారులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ ప్రమాదాలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించారు. డైట్ కాలేజ్, ఆదిత్య కాలేజ్ విద్యార్థులు స్కిట్ ప్రదర్శనలు చేసి ప్రజల్లో చైతన్యం నెలకొల్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, విశాఖ డీఐజీ గోపినాథ్ జట్టి, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా, ఏపీయుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద్ సత్యనారాయణ, డైట్ కాలేజ్ చైర్మన్ దాడి రత్నాకర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సందర్భముగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం గత దశాబ్దంలో 200% పెరిగిందని, ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రతి విద్యాసంస్థలో తప్పనిసరిగా అవగాహన వర్క్‌షాపులు నిర్వహించాలని సూచించారు. విశాఖ డీఐజీ అభ్యుదయ యాత్ర ప్రజా ఉద్యమమై మారిందని తెలిపారు. గత 4 నెలల్లో 20వేలు కంటే ఎక్కువ యాంటీ-డ్రగ్స్ కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ అవగాహన మరింత పెరగాల్సి ఉందని అన్నారు. గత ఏడాది 2,500 అరెస్టులు, 77 మందికి 20 ఏళ్ల జైలు శిక్షలు విధించబడ్డాయని వివరించారు. ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి డ్రగ్-ఫ్రీ సందేశం చేరడమే లక్ష్యమని పిలుపునిచ్చారు. డ్రగ్స్ బారిన పడినవారిని తిరస్కరించకుండా వారిని తిరిగి సమాజంలో నిలబెట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సోషియల్ మీడియా సహా ఏ అలవాటైనా అడిక్షన్‌గా మారకూడదని విద్యార్థులను హెచ్చరిస్తూ మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని స్పష్టం చేశారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఈ యాత్ర మొత్తం 5 జిల్లాల్లో ఒక నెలపాటు కొనసాగుతోందని తెలిపారు. 1.5 సంవత్సరాల్లో 3,500 స్కూళు ,, గ్రామాల్లో 'సంకల్పం' కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించామని చెప్పారు. డ్రగ్స్‌పై సమాచారం కోసం 112, 1972 నంబర్లను వినియోగించవచ్చని సూచించారు. సమాచార దాతల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.

అభ్యుదయ సైకిల్ యాత్ర -పాయకరావుపేట నుండి ఇచ్ఛాపురం వరకు డీఐజీ ఆధ్వర్యంలో సాగుతున్న ఈ మహా యాత్ర విశాఖ రేంజ్‌లోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో డ్రగ్స్ ప్రమాదాలపై స్పష్టమైన సందేశాన్ని పంచుతోంది. డీఐజీ ప్రస్తావించిన ప్రధానాంశాలు డ్రగ్స్ కుటుంబాలు, సమాజం, యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయి. పోలీసులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు కలిసి పనిచేయాలి. డ్రగ్ మాఫియా నుంచి యువతను రక్షించడం అందరి బాధ్యత" అని స్పష్టం చేశారు. సైకిల్ ర్యాలీ ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డ్, రింగ్ రోడ్, పెరుగు బజార్, నాలుగు రోడ్లు, ఆర్టీసీ కాంప్లెక్స్, నేషనల్ హైవే నాగులాపల్లి జంక్షన్, మునగపాక మండలం ప్రముఖ అధికారులు స్వయంగా ర్యాలీలో పాల్గొనడంతో విద్యార్థుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. ఈ ర్యాలీలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు డీఎస్పీలు ఎం.శ్రావణీ, ఈ.శ్రీనివాసులు

ఇన్స్పెక్టర్లు లక్ష్మీ, గఫూర్, ప్రేమ్ కుమార్, వెంకట నారాయణ, అశోక్ కుమార్, స్వామినాయుడు

పోలీసు సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థల విద్యార్థులు భారీగా పాలుపంచుకున్నారు.



# శ్రీ స్వామివారిని దర్శించుకున్న నటుడు బాలకృష్ణ దర్శకుడు బోయపాటి





**సింహాచలం, పెన్ పవర్, నవంబర్ 18 :** హిందూపురం ఎమ్మెల్యే, తెలుగు సినీ నటుడు మరియు టిడిపి సీనియర్ నాయకుడు నందమూరి బాలకృష్ణ ఈరోజు సింహాచలంలో వెలసిన శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామివారిని సందర్శించి, దర్శించుకున్నారు. ఈ దర్శన యాత్రలో ఆయనతో పాటు ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీను, నిర్మాతలు రామ్ ఆచంట మరియు కోటి పరుచూరి పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న వెంటనే ఆలయ అధికారులు వీరికి ఘన స్వాగతం పలికారు.

**ఉపచారపూర్వక స్వాగతం..**

ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధా, సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణ అధికారి పూసపాటి సునీల్ కుమార్, పీఆర్ఓ నాయుడు తదితర ఆలయ సిబ్బంది ప్రత్యేక మర్యాదలతో బాలకృష్ణ బృందాన్ని ఆహ్వానించారు. నాదస్వర ధ్వనులు, వేదమంత్రాల నడుమ ఆలయ అర్చక స్వాములు బాలకృష్ణ, బోయపాటి శ్రీను మరియు ఇతర ప్రముఖులను లోపలికి తీసుకెళ్లి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.

**కప్పస్తంభ ఆలింగనం – ప్రత్యేక దర్శనం..**

స్వామివారి దర్శనానికి ముందుగా బాలకృష్ణ మరియు బోయపాటి శ్రీను ఆలయంలోని పవిత్రమైన కప్పస్తంభాన్ని ఆలింగనం చేశారు. అనంతరం బేడా మండపాన్ని ప్రదక్షిణ చేసి, ఆపై స్వామివారి మూల విరాట్టు వద్ద ప్రత్యేక దర్శనం, పూజలు నిర్వహించారు.

**వేదాశీర్వచనాలు – శేష వస్త్ర సత్కారం..**

స్వామివారి దర్శనానంతరం ఆలయ వేదపండితులు బాలకృష్ణ, బోయపాటి శ్రీనులకు వేద ఆశీర్వచనాలు అందించారు. తర్వాత స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, ప్రత్యేక గౌరవం తెలిపారు. డీఈఓ సింగం రాధా, ఏఈఓ కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి బి. సత్య శ్రీనివాసు కలిసి బాలకృష్ణకు స్వామివారి జ్ఞాపిక మరియు ప్రసాదాలు అందజేశారు. ప్రజల శాంతి, లోక కల్యాణం కోసం ప్రార్థన చేశారు. దర్శనం అనంతరం మాట్లాడిన బాలకృష్ణ సింహాచలేశ్వరుడి దర్శనం ఎంతో ఆధ్యాత్మిక ఆనందాన్ని ఇస్తుంది. రాష్ట్ర ప్రజల శాంతి, లోక కల్యాణం కోసం స్వామిని ప్రార్థించానని తెలిపారు.

**పటిష్ట బందోబస్తు..**

విజిట్ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు, అభిమానులు చేరడంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐ సన్యాసినాయుడు, ట్రాఫిక్ సీఐ సురేష్, ఎస్సై అప్పలనాయుడు తదితర అధికారు భద్రతా వ్యవస్థను పర్యవేక్షించారు.



# జల జీవన్ నిధులతో వాటర్ ట్యాంక్ ప్రారంభం





బెన్నవరం పంచాయతీ కట్టువీధిలో నిర్మాణం

సర్పంచ్ బచ్చుల సన్యాసమ్మ

**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 18 :–** చింతపల్లి మండలం బెన్నవరం పంచాయతీ కట్టువీధి గ్రామంలో జల జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన కొత్త వాటర్ ట్యాంక్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. సర్పంచ్ బచ్చుల సన్యాసమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి టూరిజం డైరెక్టర్, రాష్ట్ర కార్యదర్శి కిల్లు వెంకట రమేష్ నాయుడు చేతుల మీదుగా ట్యాంక్ ప్రారంభోత్సవం జరిగింది. వాటర్ ట్యాంక్ ప్రారంభంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులోకి రావడంతో గ్రామ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని స్థానికులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పూజారి నారాయణమూర్తి, బూత్ కన్వీనర్ మారిగల చంటిబాబు, పూజారి నాగేశ్వరరావు, బీజేపీ నాయకులు ఉల్లి రమణ, మర్రి సాంబశివరావు, పిసా అధ్యక్షుడు డిప్పల రాజు, ముప్పల సత్తిబాబు, ముప్పల రాంబాబు, టీడీపీ నాయకులు గెమ్మెల దేవుడు బాబు, అశోక్, సతీష్, యోసేపు, జీవన్, నవీన్, పాలికి చిన్నారావు, తామర్ల రమేష్, సులభం సతీష్, హెూనాక్ శోభ, నూకరాజు, జత్త రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ రవి, రమేష్ నాయుడుకు పుష్పగుచ్ఛాలు అందజేశారు.

# మహిళల భద్రత సాధికారత కోసం సమగ్ర వ్యవస్థ అవసరం





**–మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ**

**విశాఖ దక్షిణం పెన్ పవర్, నవంబర్ 18 :**మహిళల భద్రత, సాధికారత, స్థిరమైన అభి వృద్ధి లక్ష్యాల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఒక సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ అన్నారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ విమెన్ సెంటర్ ఫర్ స్టడీస్ ఆధ్వర్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం సెమినార్ హాల్‌లో మహిళల భద్రత, బెంచ్ మార్కింగ్ వ్యవస్థలు, భవిష్యత్ కార్యాచరణపై మంగళవారం నిర్వహించిన సెమినార్‌లో ఆమె ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది.

డా. శైలజ మాట్లాడుతూ తాజాగా నేషనల్ కమిషన్ ఫర్ విమెన్ విడుదల చేసిన 'నారి 2025' సర్వేలో విశాఖపట్నం దేశంలో అత్యంత సురక్షిత నగరంగా గుర్తింపు పొందిన విషయాన్ని పేర్కొన్నారు. ఈ గుర్తింపును సంవత్సరానికే పరిమితం కాకుండా శాశ్వతంగా కొనసాగించే విధంగా అన్ని జిల్లాల్లో మహిళా భద్రతా ప్రమా ణాలను బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల 'విమెన్ స్టడీస్ సెంటర్‌ల'తో కలిసి మహిళా కమిషన్ ఒక ప్రత్యేక మిషన్ ప్రారంభించినట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ వంటి అధికారులు మారినా కూడా వ్యవస్థ కొనసాగేటట్లు ఒక స్థిరమైన సిస్టమాటిక్ అప్రోచ్ అవసరం ఉందని చెప్పారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ పుట్టిన నాటి నుంచే ఆడపిల్లల ఆరోగ్యం, విద్య, భద్రతపై సమాజం బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యతో పాటు ఆర్థిక%-%సామాజిక రక్షణ లభిస్తేనే మహిళ సాధికారత సాధ్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న శ్రీశక్తి పథకం, ఉచిత బస్సు ప్రయాణం వంటి చర్యలు మహిళలకు ఆత్మవిశ్వాసాన్ని పెంచు తున్నాయని తెలిపారు. మహిళలకు ఎప్పుడైనా సహాయం అందించే వన్ స్టాప్ సెంటర్ సేవలను వివరించారు.

పోలీస్ కమిషనర్ శంఖబ్రతా బాగ్చీ మాట్లాడుతూ మహిళలు అర్ధరాత్రి స్వేచ్ఛగా సంచరించే పరిస్థితులు ఏర్పడినప్పుడే నిజమైన భద్రత నిలుస్తుందని అన్నారు. మహిళల కోసం 24%ఇ%7 పోలీసులు సేవలు అందుబాటులో ఉ న్నాయని, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు పోలీసులతో సహకరిస్తే భద్రత మరింత బలోపేతం అవుతుం దని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా

# కనకదాసు జయంతి వేడుకలు





**అనకాపల్లి, పెన్ పవర్, నవంబర్ 18:** ప్రముఖ భక్తకవి, సన్మార్గదర్శి శ్రీ కనకదాసు జయంతిని పురస్కరించుకుని అనకాపల్లి జిల్లా పోలీసు వ్యవస్థ ఆధ్వర్యంలో నేడు పోలీసు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ ముందడుగుతో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది విశేషంగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం ప్రారంభంలో కనకదాసు చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, మహనీయ కవికి ఘన నివాళులు అర్పించారు. అనంతరం అధికారి లు మాట్లాడుతూ కనకదాసు బోధనలు సామాజిక సమానత్వం, మానవతా విలువలు, భక్తి పరమార్థాలను ప్రతిబింబించేవని గుర్తుచేశారు. సమాజ నిర్మాణంలో నైతికత, వినయం, పరస్పర గౌరవం వంటి విలువలను ప్రోత్సహించడంలో కనకదాసు రచనలు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.

జిల్లా పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు మాత్రమే కాకుండా యువత కూడా కనకదాసు ఆలోచనలు, బోధనలను జీవితంలో అమలు చేసుకోవాలని సూచించారు. ప్రజాసేవలో నిజాయితీ, అంకితభావం, బాధ్యతతో పనిచేయాలనే స్పూర్తిని ఆయన జీవితం అందిస్తుందని అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో పాటు ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పి.సి.ఆర్ ఇన్స్పెక్టర్ రమేష్, ఎస్సైలు ప్రసాద్, సురేష్ బాబు తదితరులు ఈ వేడుకను విజయవంతం చేశారు. జిల్లాలో సాంస్కృతిక, నైతిక విలువలకు ప్రాధాన్యమిస్తూ ఇలాంటి కార్యక్రమాలను మరింతగా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

## జీవీఎంసీ 56వ వార్డ్

# దయానందనగర్‌లో గెడ్డ సమస్య పరిష్కారం

పూడిక సమస్యపై ఎమ్మెల్యే గణబాబు ఆదేశాలతో వెంటనే చర్యలు





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 18 :** జీవీఎంసీ 56వ వార్డ్, దయానందనగర్ (చాకలిగెడ్డ) ప్రాంతంలో గెడ్డ పూడిక కారణంగా మురుగు నీరు ఇళ్లలోకి ప్రవేశించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానిక వార్డ్ కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబుకి తెలియజేశారు. ఈ సమస్యను ప్రాధాన్యంగా తీసుకున్న ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి, గెడ్డలోని పూడికలను తొలగించి మురుగు నీరు సాఫీగా ప్రవహించేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అధికారుల బృందంలో జెడ్సి రాము, ఈఈ తార ప్రసన్న, వాటర్ సప్లై ఈఈ మురళీకృష్ణ, శాంతి డిపార్ట్మెంట్ సచివాలయం అధికారులు పరామర్శించి, అవసరమైన పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాండ్రేకుల వెంకటరావు, రాపేటి జోగినాయుడు, పూజారి జీవ, ఎస్ నూకరాజు, పైడమ్మ పరమేశ్వరి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే స్పందన పట్ల స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# గ్రామాలన్నింటిలో త్రాగునీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి




**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్,నవంబర్ 18 :**జిల్లాలోని గ్రామాలు, పాఠశాలలు, అంగన్వాడీ ల్లో సరఫరా అవుతున్న త్రాగునీటి నాణ్యత పట్ల నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం తన ఛాంబరులో గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య కమిటీ సమావేశాన్ని ఆయన నిర్వహించారు.

కలెక్టర్ మాట్లాడుతూ

త్రాగునీటి ట్యాంకులు క్రమం తప్పకుండా శుభ్రపరచడం, నీటి క్లోరినేషన్ నిర్బంధంగా చేయడం, ప్రతి త్రాగునీటి వనరులో కాలుష్యం చొరబడకుండా పర్యవేక్షణ పెంచాలని అధికారు లను ఆదేశించారు. గ్రామాల్లో బహిరంగ మల విసర్జన పూర్తిగా నిర్మూలించేలా చర్యలు తీసు కోవాలని, అలాగే కాచిన నీటిని తాగడం, భోజ నం ముందూ వెంట శుభ్రంగా చేతులు కడుక్కో వడం వంటి అలవాట్లపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు.గ్రామాల్లో మరమ్మత్తు లు అవసరమైన బోర్‌వెల్లు, పైప్‌లైన్ పొడిగింపు అవసరాలు, వ్యక్తిగత మరుగుదొడ్లు ఏర్పాటుకు సంబంధించిన వివరాలను సర్వే చేసి జడ్‌పీ అనుమతులు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.భూగర్భ జలాలు పెంపు దిశగా కమ్యూనిటీ సోక్‌పిట్‌లు నిర్మించడం, చెరువుల గట్టులను బలపరచడం, నీటి నిల్వ సామర్థ్యం తగ్గిన చెరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా గుర్తించి పూడికతీత చేయించే లా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని 79 గ్రామాల్లో ప్రతి ఇంటికీ శాతం నూరు కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేసి "హర్ గర్ జల్ గ్రామాలు"గా మార్చే పనులను వేగవంతం చేయాలని సంబంధిత శాఖలతో సమన్వయం చేసి అమలు చేయాలని ఆర్‌డ బ్ల్యూఎస్ ఇంజినీర్ రామస్వామికి సూచించారు.

ఈ సమావేశంలో పంచాయతీ విభాగ అధికారి శ్రీనివాస్, డీడబ్ల్యూఎంఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పూర్ణి మా దేవి, జిల్లా వైద్య%–%ఆరోగ్య శాఖ అధికారి జగదీశ్వర్‌రావు, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీపతి, ఏపీసీ చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, ఇరిగేషన్ ఇంజినీర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 40వ జాతీయ పోస్టల్ టి టి ఛాంపియన్ షిప్‌లో ఆచంట ఉమేష్ కు గోల్డ్ మెడల్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 18:**విశాఖపట్నంలో ఈనెల 10 నుండి 15 వరకు ఎస్ 3 స్టేడియంలో జరిగిన 40వ జాతీయ పోస్టల్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో రాజమండ్రికి చెందిన ఆచంట ఉమేష్ టీమ్ విభాగంలో గోల్డ్ మెడల్ ను సాధించారు. ఈ ఛాంపి యన్‌షిప్ కోసం నవంబర్ 1 నుండి 8 వరకు హైదరాబాద్‌లో జరిగిన కోచింగ్ క్యాంపులో పాల్గొని, అనంతరం విశాఖపట్నంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాల సర్కిల్స్ పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో తమిళనాడుని ఓడించి గోల్డ్ మెడల్‌ను దక్కించు కున్నారు. కే. పవన్‌తో కలిసి డబుల్స్ విభాగంలో సిల్వర్ మెడల్ ను కూడా సాధించారు. ఈ అవార్డు ప్రధానో త్సవంలో, ఉమేష్‌కు గోల్డ్ మెడల్‌ను ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ శ్రీమతి బి పి శ్రీదేవి అందించారు.

ఆచంట ఉమేష్ ఇప్పటివరకు 30 కి పైగా జాతీయ క్రీడల్లో పాల్గొని, జాతీయ పోస్టల్, జాతీయ సివిల్ సర్వీసెస్ పోటీలలో 10 మెడల్స్ సాధించిన అనుభవజ్ఞుడైన క్రీడాకారుడు.

ఈ సందర్భంగా ఆచంట ఉమేష్ మాట్లాడుతూ, టేబుల్ టెన్నిస్, మౌంటేనీరింగ్ రంగాల్లో నిరంతర సహకారం అందిస్తున్న పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కి, ఎం ఎల్ ఏ అదిరెడ్డి వాసుకి, ఎం ఎల్ సి సోము వీర్రాజు, మాజీ ఎం ఎల్ ఏ అకుల సత్యనారాయణ, రాజానగరం ఎం ఎల్ ఏ బత్తుల బాలరామకృష్ణ కి, ఎం ఎల్ ఏ గోరంట్ల బుచ్చయ్య చౌదరి కి, మాజీ ఎం ఎల్ ఏ జక్కంపూడి రాజా , మాజీ రూడా చైర్మన్ గన్ని కృష్ణ కి, మాజీ ఏపీ టీటీ పి అధ్యక్షుడు భాస్కర్ రామ్ కి ధన్యవాదాలు తెలిపారు.

## 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా వ్యాసరచన పోటీలు




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 18.** 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు శనివారం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ పోటీల్లో తాడేపల్లిగూడెం పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, విద్యార్థినీలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 100 మంది వరకు పాల్గొనగా, 6వ, 7వ తరగతి విద్యార్థులకు 'పర్యావరణ కాలుష్య నివారణ' అనే అంశంపై వ్యాసరచన, 8వ, 9వ, 10వ తరగతుల వారికి 'నేను–నా దేశం' అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు.

పోటీకి న్యాయనిర్ణేతలుగా గరికపాటి బాపయ్య శర్మ, ప్రతి వీరాస్వామి, ఏవి లక్ష్మణరావు, ఏ. జనార్దన్ రావు మరియు ఏ. జాను బాబు పాల్గొన్నారు. విజేతలకు త్వరలో బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## విద్యార్థులు క్రీడల్లో ఉన్నతమైన స్థాయికి ఎదగాలి.

.కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే %డ% ప్రభుత్వ విప్.తోయక జగదీశ్వరి.




**గుమ్మలక్ష్మీపురం నవంబర్ 18 పెన్ పవర్.** అండర్ - 14 జిల్లా స్థాయి బాల బాలికల క్రీడా ఎంపికలను ప్రారంభించిన ప్రభుత్వ విప్.మండల కేంద్రంలో మంగళవారం నాడు హెచ్ గ్రౌండ్ క్రీడా మైదానంలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14,జిల్లా స్థాయి బాలబాలికల వాలీబాల్ క్రీడా ఎంపికలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి ప్రారంభించారు.ముందుగా ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి,వాలీబాల్ సర్వీస్ చేసి క్రీడా ఎంపికలను ప్రారంభించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ,బాల బాలికలు స్నేహపూర్వకంగా ఎంపికలో పాల్గొనాలని,క్రీడలు ఆరోగ్యానికి,మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యతో పాటు క్రీడా స్ఫూర్తితో కూడా ముందుకి వెళ్లాలని,విద్యా క్రీడ రెండు సమానంగా వెళ్లాలని,విద్యార్థి విద్యార్థులను ఇంత స్థాయికి వచ్చే విధంగా తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులకు అభినందనలు తెలుపుతున్నానని ఎమ్మెల్యే అన్నారు.ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు మాట్లాడుతూ.అండర్ 14 బాల బాలికలకు నవంబర్ 18వ తేదీన వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయి జట్లను ఎంపిక చేయడం జరిగిందని.ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని నాలుగు డివిజన్లు(విజయనగరం,పార్వతీపురం,బొబ్బిలి ,చీపురుపల్లి)లో గల పాఠశాలల నుండి బాల బాలికలు పాల్గొంటున్నారని తెలిపారు.జిల్లా స్థాయిలో ఎంపికైన జట్లు గుంటూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు.కార్యక్రమంలో నాలుగు డివిజన్ల వ్యాయమ ఉపాధ్యాయులు,ఎంఈఓ 2 భీముడు,స్కూల్ గేమ్స్ సెక్రెటరీ కె నాగమణి,ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి పి చంద్ర మోహన్, వ్యాయమ ఉపాధ్యాయ సంఘం గౌరవ అధ్యక్షులు వాసుదేవరావు,కురుపాం నియోజకవర్గ గేమ్స్ ఇన్చార్జి ఎన్ మాధవరావు.సురేష్ గిరి మురళి నాయకులు దామోదర్ రావు రాజు భాస్కరరావు,రామారావు,చిన్న రాజేష్,రాజు,జయంతు, రామారావు,కామేష్, సురేష్,దొరబాబు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.కూటమినాయకులు,ఏఎంసీ చైర్పర్సన్ కడ్రక కళావతి,టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్,తహసిల్దార్ శేఖరం,బిజెపి ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం,బిజెపి మండల కన్వీనర్ కడ్రక అప్పలస్వామి,మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్ రావు,పార్వతీపురం డివిజన్ ఇంచార్జ్ వైకుంఠరావు,వ్యాయామ ఉపాధ్యాయ సంఘం గౌరవాధ్యక్షులు వాసుదేవరావు, కురుపాం నియోజకవర్గ గేమ్స్ ఇంచార్జ్ మాధవరావు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్ మాధవరావు,వ్యాయామ ఉపాధ్యాయులు,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## 15వ ఫైనాన్స్ నిధులతో సి సి రోడ్డుభూమిపూజ

- ఏక వలసపల్లిలో 45 మీటర్ల సీసీ రోడ్డు
- సర్పంచ్ కే. రమేష్ నాయుడు



**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 18 :-** చింతపల్లి మండలం బలపం పంచాయతీ ఏక వలసపల్లి గ్రామంలో 15వ ఫైనాన్స్ నిధులతో నిర్మించనున్న 45 మీటర్ల సీసీ రోడ్డుకు సోమవారం భూమి పూజ నిర్వహించారు. మెయిన్ రోడ్ నుండి అఱుగూరు నీలకంఠం నివాసం వరకు ఈ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కే. రమేష్ నాయుడు, ఎంపీటీసీ బచ్చలే మచ్చమ్మ, వైకాపా నాయకుడు బాబురావు, వార్డు సభ్యురాలు అఱుగూరు విజయలక్ష్మి, గ్రామస్తులు అఱుగూరు నీలకంఠం, ఆనందరావు, మచ్చారూ, లక్ష్మీ, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని సర్పంచ్ తెలిపారు.

## కూటమి ప్రభుత్వ ఎన్నికలహామీఅమలు చేయాలి

భవన నిర్మాణ కార్మికుల డిమాండ్





**విశాఖ పెన్ పవర్ నవంబర్ 18 :**

భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికైడిసెంబర్ నెల లో జరిగే డిప్యూటీ సీఎం కార్యాలయం ముట్టడికి కార్మికులు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు

మంగళవారం స్థానిక పౌర గ్రంథాలయం జరిగిన గ్రంథాలయంభవన నిర్మాణ కార్మికుల ప్రాంతీయ సదస్సుకు యూనియన్ జిల్లా అధ్యక్షులు కోట సత్తిబాబు అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొని , పడాల రమణ మాట్లాడుతూ ఏ.పీ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు చట్టం 1996.ను పటిష్టంగా అమలు చేస్తూ వెల్ఫేర్ బోర్డు ద్వారా పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం హామీని గాలికి వదిలి సమీక్షలు సభలు పేరుతో కాలం గడుపుతూ సమస్యలను మరింత జటిలం చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందని కార్మికుల కడుపులు కొట్టిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికుల కన్నీరు తుడుస్తామని గత ప్రభుత్వం రద్దు చేసిన సంక్షేమ పథకాలన్నీ అమలు చేయడంతో పాటు మరిన్ని పథకాలతో కార్మికుల సంక్షేమ ధ్యేయంగా కూటమి ప్రభుత్వం యువ గలం పాదయాత్రలో అనేక జిల్లాలో మాట్లాడిన మంత్రి నారా లోకేష్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు కనీసం ఇచ్చిన మాటకు కట్టుబడిన దాఖలాలు కనబడటం లేదని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డుకు తన సొంత నిధులు కోటి.రూపాయలు ఆర్థిక సహాయం చేస్తానని ఇచ్చిన హామీ మరిచిపోయురా అన్నారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు రెండు సంవత్సరాలు దగ్గరలో ఉన్న అధికారుల చుట్టు ఎమ్మెల్యేలకి మంత్రులకి జిల్లా కలెక్టర్ కి అనేక దపాలుగా .నిరసన తెలియజేసి వినతి పత్రాలు ఇచ్చిన సంక్షే బోర్డు ను. పునరుద్ధనకై ఈ ప్రభుత్వం ఏమాత్రం చర్యలు తీసుకో పోగ. సమావేశాలు సమీక్షల పేరుతోకార్మిక ద్రోహానికి పాల్పడుతున్నారని కాలం గడుపుతూ కార్మిక ద్రోహానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. గత అసెంబ్లీ సమావేశంలో కూటమి ఎమ్మెల్యేలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ను పునరుద్ధరణ చేస్తాం వాళ్లకి ఎన్నికలలో హామీ ఇచ్చాం అని మీ ఎమ్మెల్యేలు చెప్పిన ఈ ప్రభుత్వానికి తన ఎమ్మెల్యేలు చెప్పిన కూడా ఏమాత్రం ఛీమ కొట్టినట్టు కూడా లేదని ఇప్పటికైనా కూటమే ప్రభుత్వం ముఖ్యమంత్రి 1996 చట్టాన్ని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను కార్మికులకే అందే విధంగా ఇతర రాష్ట్రాల మాదిరిగా మన రాష్ట్రంలో కూడా సంక్షేమ పథకాలు అమలు చేయాలని పెండింగ్లో ఉన్న 46వేల క్లెయిమ్స్ రిలీజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాం లేని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఇతర కార్మిక సంఘాలను కలుపుకొని భవన నిర్మాణ కార్మికుల సమీకరించి డిసెంబర్ నెలలో చలో మంగళగిరి లో ఉపముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడి నిర్వహిస్తామని భవన నిర్మాణంగా కార్మికులు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారంగా 16 నెలల కావస్తున్న సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేయలా పెండింగ్లో ఉన్న 46,000 క్లైమ్సు రిలీజ్ చేయలేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో ఇప్పుడున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడు భవన నిర్మాణ కార్మికులకు పనిముట్లు ఇచ్చారు ఆ పనిముట్లు ఇంకా లేబర్ ఆఫీస్ లో తుప్పు పట్టి పట్టిపోతున్నాయి ఆ పనిముట్లన్నీ ఎవరైతే రిజిస్టర్ అయిన కార్మికులు ఉన్నారు వారికి అందజేయాలని ఈ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాం అలాగే పట్టణ మండల ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మికులు ఇంటి అద్దె ఇల్లు కట్టుకోలేక కుటుంబ పోషణ కరువై పనులు సక్రమంగా దొరక్క నిత్యవసర వస్తువులు ధరలు పెరిగాయి. అంటే భవన నిర్మాణ కార్మికులకు చాలా దుర్భర జీవితంలో అనుభవిస్తున్నారు ఇప్పటికైనా ఈ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధన చేయాలి. లేని పక్షంలో ప్రభుత్వానికి రానున్న స్థానిక ఎన్నికల్లో.తగిన గుణపాఠం చెప్పు తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కోన లక్ష్మణ, సంఘం అధ్యక్షులు కూన కృష్ణ రావు, నాయకులు ఎన్.సూర్య నారాయణ, కె.ఈశ్వరరావు,వై. ఎస్. మూర్తి,కె. వినోద్. ఆర్ లక్ష్మీనారాయణ.శివారెడ్డి.యోగి. దాలిబాబు. అప్పలరాజు. వై. అప్పలనాయుడు ఏఐటీయూసీ. అల్లిపిల్లి అప్పారావు నాయకులు కె.సత్యనారాయణ, మధు రెడ్డి పాల్గొన్నారు

## నేడు అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ సొమ్ములు విడుదల



**గోకవరం, పెన్ పవర్, నవంబరు 18 :** అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ రెండవ విడత సొమ్ములను బుధవారం జగ్గంపేట నియోజకవర్గంలోని గండేపల్లి మండలం మురారి గ్రామంలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విడుదల చేయనున్నట్లు ఏఓ రాజేశ్వరి తెలిపారు.మండలానికి సంబంధించి 4 కోట్ల 94 లక్షల 95 వేల రూపాయలు విడుదల కానుండగా 7705 మంది రైతులు లబ్ధి పొందనున్నారని ఏఓ తెలిపారు.

## సుందరపల్లి గ్రామంలో సోమేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి వల్లూరి కుటుంబం 2 లక్షలు విరాళం.



**కె గంగవరం పెన్ పవర్ నవంబర్ 18:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కె గంగవరం మండలం సుందరపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ ఉమా సమేత సోమేశ్వరస్వామి ఆలయం అభివృద్ధి కోసం రామచంద్రపురం నివాసి వల్లూరి సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన భార్య సత్యవతి సంతానం అయిన కుమారులు శ్రీరామ్ కుమార్, లక్ష్మణ్ శేష కుమార్ మరియు కుమార్తె శ్రీదేవిలు విశేషమైన విరాళాన్ని అందించారు.

ఆలయ వరండా ద్వారపాలకుల నిర్మాణ నిమిత్తం కుటుంబ సభ్యులు కలసి 2,00,116/– రూపాయలను భక్తిశ్రద్ధలతో ఆలయ కమిటీకి అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వల్లూరి కుటుంబం చేసిన ఈ ఉదార దానాన్ని ప్రశంసిస్తూ, ఆలయ నిర్మాణ పనులకు ఇది ఎంతో తోడ్పడనుందని తెలిపారు. గ్రామ పెద్దలు, భక్తులు కూడా ఈ సేవా భావాన్ని అభినందించారు.

## వాడపల్లి ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన ఆర్డీవో శ్రీకర్, డిప్యూటీ కమిషనర్ చక్రధరరావు





**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 18:**కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కొత్తపేట ఆర్డీవో పి. శ్రీకర్, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు.

వకుళమాత అన్నదాన భవనం నిర్మాణం, కోనేరు అభివృద్ధి, క్యూ లైన్ల ఏర్పాటు వంటి పనుల పురోగతిని అధికారులు సమీక్షించారు. అదేవిధంగా ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రతిపాదించిన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి స్థల పరిశీలన కూడా చేపట్టారు.

తదనంతరం జరుగుతున్న పనుల గురించి సంబంధిత శాఖా అధికారులతో ఆర్డీవో ఆరా తీశారు. పనులను వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.కార్యక్రమంలో ఎంపీడీవో రామన్, ఎంఆర్ఓ రాజేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, ఆలయ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అల్లూరి జిల్లా లో హెల్త్ ఎమర్జెన్సీ తక్షణమే ప్రకటించాలి





**చిన్నారులు ఎంత మంది చనిపోయారో ప్రభుత్వం దగ్గర సమాచారమే లేదు.**

**ఆరుగురు చనిపోయినా ఇప్పటివరకు వైద్య శిబిరం కూడ పెట్టని వైనం.**

**జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు భాగ్యలక్ష్మి.**

**ముంచంగి పుట్టు, పెన్ పవర్, నవంబర్ 18.**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, వైసిపి ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. జిల్లాలో చిన్నారుల మృత్యు ఘోష గురించి రాష్ట్ర కూటమి ప్రభుత్వం వద్ద కనీసం సమాచారం కూడ లేకపోవడం దురదృష్టకరమని ఆక్షేపించారు. మంగళవారం ముంచంగిపుట్టు మండలం దారెల పంచాయతీ పరిధిలోని ఆరుగురు చిన్నారులు చనిపోయిన నేపథ్యంలో వైఎస్ఆర్సిపి నేతలంతా డి. కుమ్మరపుట్టు గ్రామంలో పర్యటించారు. అక్కడ బిడ్డలను కోల్పోయిన తల్లులతో పరిస్థితిని అడిగితెలుసు కున్నారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతమంది చిన్నారులు చనిపోయారో ఇప్పటి వరకు ప్రభుత్వం వద్ద కనీసం సమాచారం కూడ లేదని గిరిజనుల ప్రాణాలు అంటే ఎంత చులకన భావన ఉందో అర్థం అవుతుందన్నారు. కనీసం జిల్లా అధికారులకు గాని అక్కడున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి గాని ఏ గ్రామంలో ఎంత మంది చనిపోయారో? ఎందుకు చనిపోయారన్న విషయంపై సమాచారం లేకుండా ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చారంటే అటు ప్రభుత్వము ఇటు ప్రభుత్వ వ్యవస్థ ఎంత నిర్లక్ష్య ధోరణి అనుసరిస్తుందో స్పష్టంగా తెలుస్తుందన్నారు. దారెల పంచాయతీ పరిధిలో ఆరుగురు చిన్నారులు చనిపోతే నిన్నటి వరకు కేవలం ముగ్గురే చనిపోయారని చెప్పిన ప్రభుత్వ అధికారులు ఈరోజు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు దారెలకు వస్తున్నారని తెలిసి చనిపోయిన వారు ఆరుగురని నివేదికగా తీసుకురావడం ప్రభుత్వం తీరు ఎలా అనేది మనమంతా అర్థం చేసుకోవచ్చన్నారు. జిల్లా వైద్యాధికారులకు చిన్నారుల మరణంపై సమాచారం లేకపోయినా ప్రభుత్వానికి అన్ని వివరాలు ఇచ్చేశామని తమకు చెప్పడం వెనక ఆదివాసీల ప్రాణాలపై నిర్లక్ష్య ధోరణి మనకు తెలుస్తుందన్నారు. దారెల పంచాయతీ పరిధిలోని డి.కుమ్మరపుట్ లో ఇద్దరు, తలింబ, డొక్రిపుట్టు, చీకుచింత ఒక్కొక్కరు మరొక గ్రామంలో ఇంకొక చిన్నారి ప్రాణాలు కోల్పోయారని వీరంతా కూడ రెండు నుంచి నాలుగు నెలల లోపు వారేనని పేర్కొన్నారు. వాస్తవాలను రాష్ట్ర కూటమి ప్రభుత్వం దాచి పెడుతుందని, అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్యాధికారి నిమోనియా సమస్యలతో చిన్నారులు చనిపోతున్నారన్న మాటలతో తాము ఏకీభవించడం లేదని వారు పేర్కొన్నారు. సాధారణంగా అత్యల్ప ఉష్ణోగ్రతలు ఉన్న ప్రాంతాలకు కాకుండా ప్రత్యేకంగా ఈ ప్రాంతానికి మాత్రమే ఇలా ఎక్కువగా జరగడం వెనుక ఒక నిమోనియా సమస్య మాత్రమే కాకుండా ఇతరేతర సమస్యలతో చిన్నారులు చనిపోతున్నారని వైఎస్ఆర్సిపి నేతలు అనుమానం వ్యక్తం చేశారు. దీనిని బయట పెట్టకుండా ప్రభుత్వం వాస్తవాలను దాచి పెడుతుందని ఆరోపించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు ఐటీడీఏ పరిధిలో 11 మండలాల నుంచి 24 మంది చిన్నారులు కేజీహెచ్ లో చికిత్స పొందుతున్నారని అంటే జిల్లాలో ఆరోగ్య పరిస్థితి ఇంత తీవ్ర స్థాయిలో క్షీణిస్తున్నసరే కూటమి ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్లైనా లేకపోవడం దురదృష్టకరమని వారు అన్నారు. హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాల్సిన అవసరం ఉన్న జిల్లా యంత్రాంగం కనీసం సమాచారం కూడా తెప్పించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఎంతమంది చిన్నారులు చనిపోయినా ప్రభుత్వం తరపు నుంచి ఒక్కరు కూడ ఏం జరిగిందనే విషయంపై ఆరా తీయకపోవడం శోచనీయమన్నారు. ఇవి ప్రభుత్వ హత్యలే అన్నారు. ఊపిరాడక ఇబ్బంది పడుతున్న చిన్నారులను వెనువెంటనే గిరిజనులు స్థానిక పిహెచ్సిలో సూచన మేరకు సిహెచ్ లకు, జిల్లా ఆసుపత్రులకు తీసుకొచ్చిన బిడ్డలను కోల్పోతున్నారంటే ప్రభుత్వం సరైన రీతిలో వారికి చికిత్స అందించడం లేదని వారు ఆరోపించారు. ముగ్గురు కూడ హాస్పిటల్లోనే చనిపోవడంపైనా ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇస్తున్నారన్నారు. ప్రభుత్వమే ఆ మాదిరిగా నివేదికలు ఇవ్వమందా? అధికారులు ప్రభుత్వాన్ని తప్పుదారు పట్టిస్తున్నారా? అన్న విషయంపై ఇప్పటివరకు స్పష్టత లేదన్నారు. పాడేరు ఆసుపత్రిలో చికిత్స పొందడానికి అవకాశం లేని వారిని కేజిహెచ్ లో చేర్పిస్తున్నారని కేజీహెచ్ లో వైద్యం అందించేందుకు వీలు లేకుండా ప్రభుత్వం బకాయి పెట్టిందన్నారు. దీనివలన గిరిజనులు అల్లూరి జిల్లాలో గాని విశాఖ కేజీహెచ్ లో గాని తమ బిడ్డలను కాపాడుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇవి ప్రభుత్వ హత్యలు అని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి గిరిజనుల పట్ల చూపుతున్న వివక్ష ధోరణిని విస్మరించకపోతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. గిరిజనులను ఒకలాగా గిరిజనేతర్లను మరోలా కూటమి ప్రభుత్వం చూస్తుందని ఈ ధోరణి తగదని హెచ్చరించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పక్షాన ఆదివాసీలు నిలబడుతున్నారనే ఉద్దేశంతో వాళ్ళ ప్రాణాల పోతున్న ప్రభుత్వం పట్టించుకోలేదని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వివక్ష పూరిత పాలనను అందిస్తామంటే సహించబోమని వారు హెచ్చరించారు. కలెక్టర్ కు వివరాలతో కూడిన నివేదిక సమర్పించమని, దారెల పంచాయతీతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇప్పటివరకు చనిపోయిన చిన్నారుల వివరాలు, కేజీహెచ్ లో చికిత్స పొందుతున్న 24 మంది పిల్లల సమాచారంతో కూడిన నివేదికను కలెక్టర్ దినేష్ కుమార్ జెడ్పీ చైర్పర్సన్ అరబీరు సుభద్ర ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అందజేశామన్నారు. హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని కోరారు. ఎస్టి సెల్ లో బకాయిలను వెంటనే చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పద్మ రావు, అరబీరు జగబందు, వైస్ ఎంపీపీ సిరిగం భాగ్యవతి, ఎంపిటిసి సుబ్బలక్ష్మి, సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు రమేష్, ఎంపిటిసి కమల, మాజీ సర్పంచులు జయదేవ్, ధనుంజయ్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంధిపూడికి చెందిన డాక్టర్ శ్రీరామకృష్ణకు ఫార్మాసూటికల్ రీసెర్చ్ అవార్డ్.





**ఆలమూరు,పెన్ పవర్, నవంబర్18:**కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చు అంటూ దానిని ఎందరో నిజం చేస్తూ నిరూపిస్తు ఉంటారు. ఆ కోవలోనే నిలిచిన మండలంలోని సంధిపూడికి చెందిన కీర్తిశేషులు సూరపురెడ్డి సోమరాజు కుమారుడు డాక్టర్ సూరపురెడ్డి శ్రీరామకృష్ణ గుంటూరు కోనేరు లక్ష్మయ్య డీమ్డ్ యూనివర్సిటీలో 2025 ఏడాదికి గాను ఎక్సలెన్స్ ఇన్ రీసెర్చ్ నందు ఉన్నత పథకాన్ని అందుకుని ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కోనేరు లక్ష్మయ్య యూనివర్సిటీలో పూర్వ విద్యార్థినన్నారు.ప్రస్తుతం హైదరాబాదులో డైసెల్ కైరెల్ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ లో డైరెక్టర్ గా పని చేస్తున్నట్లు తెలిపారు. కేఎల్ యూనివర్సిటీలో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ అండ్ అనలిటికల్, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ నందు అంకిత భావంతో పరిశోధన చేసినట్లు తెలిపారు. అందులో ఉన్నత ప్రతిభ కనబరిచినందుకు ఈ అవార్డు దక్కినట్లు తెలిపారు. ఇవి 2025 నంబరు 15న యూనివర్సిటీలో జరిగిన అల్యూమ్నీ అవార్డ్స్ మహోత్సవంలో పొందానన్నారు. ఈ అవార్డు ద్వారా మరింతగా సేవలు కొనసాగిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పథకాన్ని పొందేటప్పుడు యూనివర్సిటీ సభ్యులు ఆకాంక్షించినట్లు తెలిపారు.అవార్డు రావడానికి సహకరించిన యూనివర్సిటీ సభ్యులకు, మెంటార్స్, సాహచరులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఇటువంటి అవార్డులే మన ప్రతిభ పాఠవాళ్లకు గుర్తింపుగా ఆయన పేర్కొన్నారు. ఫార్మాస్యూటికల్ శాస్త్రాలలో ప్రభావవంతమైన పరిశోధనలను ముందుకు తీసుకెళ్లడం, అనలిటికల్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ నందు నూతన ఆవిష్కరణలకు బాధ్యత వహించడంలో ఈ పతకం నా కట్టుబాటును మరింత బలపరుస్తోందన్నారు. ఈ సందర్భంగా శ్రీరామకృష్ణతో చదువుకున్న పూర్వపు విద్యార్థులు యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు స్థానిక కొత్తూర్ ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.వి.వి.రమణ, పినపల్ల సర్పంచ్ సంగీత సుభాష్, తదితరులు అభినందనలు తెలియజేశారు.

## జనార్ధనస్వామి ఆలయానికి జనరేటర్ సమర్పణ



**ఆలమూరు, పెన్ పవర్, నవంబర్ 18:**నారద మహర్షి ప్రతిష్టిత ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధన స్వామి వారి ఆలయానికి రూ.15వేల విలువైన 1000 వోల్ట్ జనరేటర్ ను ఆలమూరు వాస్తవ్యులు కామవరపు సత్య సుబ్రమణ్య శర్మ(ట్రైపింగ్ శర్మ), కాశీ అన్నపూర్ణ దంపతులు అందజేశారు.మంగళవారం ఆలయానికి విచ్చేసి వారు జనరేటర్ ను ఆలయ చైర్మన్ భైరిశెట్టి రాంబాబు, అర్చకులు ఖండవల్లి ప్రభాకరాచార్యులు, అంగర భగవానాచార్యులకు అందజేశారు. దాతలను పలువురు అభినందించారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా గ్రంధి సత్యనారాయణ ఏకగ్రీవ ఎన్నిక



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 18:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల మేనేజ్మెంట్ అసోసియేషన్ (%ఊూరాజనజు మీఘఋుస్త్రవఎవత్ చాంంశీఎఋఖ్ఆశీఅ%) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాలల అధ్యక్షులు గ్రంధి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది.

అసోసియేషన్ వెల్లడించిన వివరాల ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాల ఏకగ్రీవ నిర్ణయంతో గ్రంధి సత్యనారాయణకు బాధ్యతలు అప్పగించారు. వివాదరహితుడిగా, సేవా తత్పరుడిగా, ఆర్యవైశ్య రాష్ట్ర ప్రముఖుల్లో ఒకరిగా గ్రంధి సత్యనారాయణకు ఉన్న ప్రత్యేక గుర్తింపు ఈ ఎన్నికకు దోహదపడింది. గ్రంధి సత్యనారాయణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికవడం పట్ల ఉమ్మడి గోదావరి జిల్లా పరిధిలో ఉన్న ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాలు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఢిల్లీలో దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన





★ కొత్తపేట నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున తరలివెళ్లిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు

**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్18:**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్పై జరిగిన అమానవీయ దాడిని తీవ్రంగా ఖండిస్తూ, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు తో ఢిల్లీలో జరిగిన దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనలో భారీ సంఖ్యలో దళిత సంఘాలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంలో కొత్తపేట నియోజకవర్గం నుండి ఛలో ఢిల్లీ కార్యక్రమానికి స్పందించిన ఎమ్మార్పీఎస్ %-% ఎం.ఎస్.పి నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకంగా తరలివెళ్లారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మర రాఘవ మాదిగ, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గ నాయకత్వంలో నాలుగు మండలాల నుంచి డజన్ల కొద్దీ కార్యకర్తలు జంతర్ మంతర్ చేరుకున్నారు. జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన సభలో పాల్గొన్న కొత్తపేట నియోజకవర్గ నాయకులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, దళితులపై జరుగుతున్న అన్యాయాలు, దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు.
దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వేలాదిగా తరలివచ్చిన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, దళిత బంధువుల నినాదాలతో జంతర్ మంతర్ ప్రాంగణం మారుమోగింది.

## ఎమ్మెల్యేలను కలిసిన గడ్డ మణుగు





**జీలుగుమిల్లి ,పెన్ పవర్, నవంబర్ 18 :** టిడిపి ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, నక్క ఆనందబాబు లను అమరావతి సచివాలయం వద్ద మంగళవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురితో కూటమి ప్రభుత్వం చేసే పలు అభివృద్ధి కార్యక్రమాలపై వారితో చర్చించినట్లు తెలిపారు. అదేవిధంగా పోలవరం నియోజకవర్గం కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి నీ వివరించినట్లు రవికుమార్ తెలిపారు.

## మాజీ సర్పంచ్ పుల్లం రాజు వర్మను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే బండారు

నియోజకవర్గ పర్యటనలో బిజీగా.. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్న ప్రజాప్రతినిధి





**ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 18:**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మంగళవారం విస్తృత పర్యటనలో భాగంగా ర్యాలి, అంకంపాలెం గ్రామాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలి గ్రామ మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకుడు పేర్చర్ల పుల్లం రాజు వర్మను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి, ఆయనతో వివరంగా మసలుకున్నారు. గ్రామానికి వెళ్లిన వెంటనే స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. వారి కుటుంబాల బాగోగులు, గ్రామ ప్రజల సమస్యలు, అభివృద్ధి పనులు, రోడ్లు, నీరు, విద్యుత్ వంటి అంశాలపై బండారు సత్యానందరావు చర్చించారు. గ్రామంలోని పనులు, భవిష్యత్‌లో చేపట్టవలసిన అభివృద్ధి చర్యలపై కార్యకర్తలతో కలిసి సమీక్షించారు. గ్రామంలోని వివిధ ప్రాంతాలను ఎమ్మెల్యే సందర్శించిన సమయంలో పుల్లం రాజు వర్మ ఆయనతోపాటు నడుచుకుంటూ స్థానిక సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్న సమారాధనలో పాల్గొన్న కంబాల శ్రీనివాసరావు



**గోకవరం , పెన్ పవర్,నవంబర్ 18:** గోకవరం గ్రామ శివారులో ఉన్న శ్రీ పార్వత వర్ధిని రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం నిర్వహించిన భారీ అన్న సమారాధన కార్యక్రమంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలుత ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని, ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, సేవకులు కంబాల శ్రీనివాసరావుని ఘనంగా సత్కరించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలయం వద్ద కోనేరు నిర్మాణానికి ఇటీవలే 5 లక్షలు రూపాయలు కమిటీ సభ్యులకు విరాళం ఇవ్వడం జరిగిందన్నారు. ఆలయ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందిస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, కూటమి నాయకులు, బత్తుల నానాజీ, దాసరి ధర్మరాజు, పెద్దాడ వెంకన్న దొర, నాగ రమేష్, అంజలి, పదిలం మురళి దేశాల నరేష్, తాటికొండ సురేష్, అంబటి శ్రీను, కొలుసు రాంబాబు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిరసిస్తూ 21,22,23 వార్డులలో రచ్చబండ



**రాజమహేంద్రవరం,పెన్ పవర్ నవంబరు 18:** మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో మంగళవారం వైయస్సార్ సీపీ కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. బాబు ష్యూరిటీ మోసాలపై 21,22,23 వ వార్డులకు సంబంధించి స్థానిక గోదావరి బండ్ , వంకాయల వారి వీధి దిగువున ఏర్పాటు చేసారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ ను అడ్డుకోడానికి జగనన్న పిలుపు మేరకు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి, కోటి సంతకాల సేకరణ చేస్తున్నామని తెలిపారు. ఇంచార్జీలు చవ్వకుల సుబ్రహ్మణ్యం, దుర్వాసుల సత్యనారాయణ, కొంచాడ ఈశ్వర్ లు కలసి ఏర్పాటు చేశారని అభినందించారు. తన మీద, తన అనుచరులు 26 మంది మీద కేసులు పెట్టడం జరిగిందని ,బెదిరేది లేదనన్నారు
ఇప్పటికీ 10 కేసులు పెట్టారని, ఇంకో 100 పెట్టదని భయపడేది లేదన్నారు. . కమిషన్లు తీసుకున్నానని తనన్ను అజ్ఞాతవ్యక్తులతో ఆరోపణలు చేయడం కాదని , ధైర్యం ఉంటే నిరూపించాలని అయితే నీచ రాజకీయం చేయడం ఈవీఎం ఎమ్మెల్యేలకు అలవాటని ఎద్దేవా చేశారు. తన ఆస్తులను అమ్ముకుని రాజకీయం లో ఉన్నా నని ప్రజల కోసం పోరాడతానని భరత్ అన్నారు. ఈ కార్యక్రమంలో వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి సిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వైభవంగా భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత వర్ష జన్మదిన వేడుకలు ప్రారంభం





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 18:**స్థానిక డి.ఎస్. చెరువు వద్ద గల శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి శత వర్ష జన్మదిన వేడుకలు సోమవారం గొప్పఆనందోత్సాహాలతో ప్రారంభమయ్యాయి. స్వామి వారి రథోత్సవంతో వేడుకలకు శ్రీకారం చుట్టగా, వాసవి ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ గ్రంధి సత్యనారాయణ ఈ రధయాత్రను ప్రారంభించారు.
ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈరోజు ప్రారంభమైన ఉత్సవాలు 23వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. 23వ తేదీ స్వామి వారి జన్మదినోత్సవం సందర్భంగా జరగనున్న "మహా నారాయణ సేవ" కార్యక్రమాన్ని స్థానిక శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించనున్నారు అని తెలిపారు.
కార్యక్రమంలో ఆకుల సవీన్ బాబా, ప్రవా శ్రీనివాస్, తోట తిరుపతి రాయుడు, మల్లిఖార్జునరావు, శోభనాద్రిరావు, ఆకుల వెంకటేశ్వరరావు, రాము, సూర్యచంద్రరావు, రుద్ర సాయి, గాదె శ్రీరామచంద్రమూర్తి, విష్ణుమూర్తి, తోలేటి శ్రీనివాస్, విశృద్, సూరజ్, రామకృష్ణ, సతీష్, వివేకానంద, జానకిరామయ్య, వెజ్జుప్రసాద్, పాలూరి సాయి, త్రినాధరావు, తోట రాధికా రాణి, కొండ లక్ష్మీ, వెంకట రమణ, శ్రీలక్ష్మీతో పాటు పెద్ద ఎత్తున సాయి భక్తులు, శ్రీ సత్యసాయి విద్యాలయం బాల, బాలికలు పాల్గొన్నారు. సాయంత్రం సంగీత విభావరి అనంతరం సత్యసాయి విద్యాలయం విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, స్వామి వారి హారతితో మొదటి రోజు కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి.

## 18 వ డివిజన్ లో రచ్చబండ లో మాజీ హెూమ్ మంత్రి తానేటి వనిత



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 18**
రాజమండ్రి రూరల్ నియోజవర్గం స్థానిక 18 వ డివిజన్ ఆల్కాట్ గార్డెన్స్ ఇంచార్జ్ అంగాడ సత్యప్రియ ఆధ్వర్యంలో రచ్చబండ , కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా తూర్పుగోదావరి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ , మాజీ హెూం మంత్రి శ్రీమతి తానేటి వనిత హాజరయ్యారు. ఈ సందర్భంగా వనితమ్మ మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు పోలీసు వ్యవస్థను తమ చేతుల్లో పెట్టుకుని రాష్ట్రాన్ని అస్తవ్యస్తంగా మార్చి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పైన నాయకుల పైన ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మాజీ మంత్రి వేణు మాట్లాడుతూ, రాష్ట్రము అన్ని విధాలా దివాలా తీసిందని కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రానికి కొత్తగా జరిగిన మేలు ఏమీ లేదన్నారు. రాష్ట్రంలో నేత కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

## హార్ట్ పేషెంట్ కు హెల్పింగ్ యూత్ సభ్యులు ఆర్థిక సహాయం.



**ఏలేశ్వరం, పెన్ పవర్, నవంబర్ 18:** స్థానిక దిబ్బలపాలెం కు చెందిన పంతం సత్యనారాయణ అనే వృద్ధునికి హెల్పింగ్ యూత్ సభ్యులు మంగళవారం ఆర్థిక సహాయం మంగళవారం అందించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ యూత్ సభ్యులు మద్దుల స్వరూప్,ఎస్ కే అలీషా మీడియాతో మాట్లాడుతూ పంతం సత్యనారాయణ, ఆయన తల్లి చాలా కాలం నుంచి అనారోగ్యానికి గురై చాలా దీన స్థితిలో ఉండడం తెలుసుకుని, హెల్పింగ్ యూత్ ద్వారా బియ్యం, కూరగాయలు,పండ్లు,1000 రూపాయల నగదు అందజేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం పింఛను గాని,రేషన్ గాని రావడం లేదని, దాతలు ఎవరైనా ఉంటే ముందుకు వచ్చి సత్యనారాయణకు ఆర్థిక సహాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ యూత్ సభ్యులు రామ్ లాల్, ఎస్కే అలీ,మద్దుల స్వరూప్,పర్వత శివ,ఎస్కే అలీషా లు పాల్గొన్నారు.

# కోటంరెడ్డి హత్య కుట్రకు.. కుట్రదారులు ఎవరు....

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హత్యకు రౌడీషీటర్లు ప్లాన్ చేసిన విషయం బయటపడి దాదాపు మూడు నెలలవుతుంది. అయితే తనపై ఒక రాజకీయ పార్టీకి చెందిన వారు తన హత్యకు కుట్ర చేశారని అప్పట్లో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆరోపించారు. రౌడీషీటర్ శ్రీకాంత్ కు ప్రధాన అనుచరుడైన జగదీష్ అనే వ్యక్తి సహచర మిత్రులతో మాట్లాడుతున్న వీడియో అప్పట్లో వైరల్ గా మారింది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేను చంపేస్తే డబ్బే డబ్బు అంటూ వారు మద్యం మత్తులో మాట్లాడుకుంటున్న వీడియో వైరల్ అయింది. దీంతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హత్యకు కుట్ర జరిగినట్లు తేలిందని పోలీసులు భావించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని చంపించాలనుకుంటున్నదెవరు? వారికి డబ్బులు ఇస్తామన్నది ఎవరు? అన్నది పోలీసుల విచారణ చేపట్టారు. కోటంరెడ్డి అనుచరులు మాత్రం తమ ఎమ్మెల్యే ను హత్య చేయడానికి వైసీపీ ముఖ్యనేత ఒకరు ప్లాన్ చేశారని చెబుతున్నారు.. అయితే మూడు నెలలవుతున్నా ఆ వైసీపీ ముఖ్య నేత ఎవరన్నది బయటకు రాలేదు. సింహపురి రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారిన ఈ ఘటన పై ఆ వైసీపీ నేతలు ఎవరన్నది ఇప్పటికీ తేలలేదు. కోటంరెడ్డి అనుచరులు చేసిన ఆరోపణల్లో నిజం లేదా? లేకపోతే పోలీసులు ఎందుకు ఇంతవరకూ ఆ నేతను బయటకు తీసుకురాలేకపోయారన్న ప్రశ్న వినపడుతుంది. అయితే పోలీసుల విచారణలో మాత్రం రౌడీషీటర్లు మాత్రమే స్కెచ్ వేసినట్లు తేలిందని చెబుతున్నారు.. అందకుంటే ఇలా చేయండి వైసీపీ ముఖ్య నేత అంటూ... తనను చంపేందుకు వైసీపీ నేతలు కొందరు కుట్ర చేశారన్న అనుమానాలు కలుగుతున్నాయని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మీడియాతో చెప్పారు. దీనిపై నెల్లూరు జిల్లా ఎస్పీకూడా స్పందించారు. తాము కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వీడియోను చూశామని, రౌడీ షీటర్ శ్రీకాంత్ అనుచరుడు జగదీష్ ఈ వ్యాఖ్యలు చేయడం వెనక ఎవరున్నారన్న దానిపై తాము దర్యాప్తు చేస్తామని చెప్పారు. కానీ నెలలు గడుస్తున్నా తేలకపోవడంతో వైసీపీ నేత హస్తం ఉన్నది ఉత్తదేనని తేలిపోయిందని ఫ్యాన్ పార్టీ నేతలు అంటున్నారు. కేవలం రాజకీయ లబ్ది కోసమే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి ఆ వీడియోను ఉపయోగించుకున్నారంటూ వైసీపీ నేతలు అంటున్నారు. మొత్తం మీద కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పై హత్యకు స్కెచ్ రౌడీషీటర్ల పనేనని అనుకోవాల్సి ఉంటుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# కొత్త నేతలపై దృష్టి...

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

వైసీపీ అధినేత జగన్ కు ఒక అభిప్రాయం మాత్రం మైండ్ లో నుంచి ఇంకా పోలేదు. దారుణమైన ఓటమి తర్వాత కూడా జగన్ మాత్రం ఆ మైండ్ సెట్ ను మార్చుకోవడం లేదు. అదే తన బొమ్మతోనే గెలుస్తారనుకోవడం. అది జగన్ భ్రమ. 2019లో గెలిచింది తనవల్లనేనన్న భ్రాంతి నుంచి జగన్ ఇంకా బయటపడటం లేదు. నాడు జగన్ పార్టీ గెలుపునకు అనేక కారణాలున్నాయి. తెలుగుదేశం పార్టీ ఒంటరిగా పోటీ చేయడం, జనసేన మరో కూటమితో జట్టు కట్టడం, బీజేపీ సొంతంగా పోటీ చేయడం ఇలా జగన్ కు 2019 ఎన్నికలు అలా కలసి వచ్చాయి. జగన్ పాదయాత్ర కొంత మేరకు పనిచేసి ఉండవచ్చు. కానీ నియోజకవర్గాల్లో అభ్యర్థులే జయాపజయాలకు కీలకమని ఎన్నో ఎన్నికలు తేల్చి చెప్పాయి.ఆంధ్రప్రదేశ్ అందులోనూ విభజన తర్వాత పూర్తిగా కులాల వారీగా చీలిపోయింది. సామాజికవర్గాల వారీగా ఓటర్లు చీలిపోయి ఉన్నారు. అలాగని ప్రతి సామాజికవర్గంలో గంపగుత్తగా ఓటర్లు జగన్ కే పట్టం కట్టరు. చంద్రబాబుకు కూడా జై కొట్టరు. కానీ స్థానికంగా వారికి అందుబాటులో ఉండే ఎమ్మెల్యే అభ్యర్థులే కీలకమవుతారు. మొన్నటి ఎన్నికల్లో కేవలం పదకొండు సీట్లు మాత్రమే రావడానికి జగన్ ప్రభుత్వ పరంగా తీసుకున్న నిర్ణయాలు యాభై శాతం ఉంటే.. మిగిలిన యాభై శాతం ఓటమి స్థానిక ఎమ్మెల్యేల పనితీరుపైనే ఉందన్నది కూడా వాస్తవం. అందుకే ఎమ్మెల్యే అభ్యర్థులే కీలకం. పార్టీ, పార్టీ అధినేత పది శాతం వరకూ మాత్రమే విజయానికి ప్లస్ గా మారతారు. .. అందకుంటే ఇలా చేయండి పాదయాత్ర చేసినందున... మిగిలిన విషయాల్లో మాత్రం స్థానిక రాజకీయాలే ప్రభావితం చేస్తాయి. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించడం, స్థానికంగా ఉండే సమస్యలపై గళం విప్పడం, వారి వ్యక్తిగత సమస్యలను సత్వరమే పరిష్కరించడం, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ లంచాల బారిన పడటం వంటివి ఎక్కువగా ఎన్నికల్లో ప్రభావితం చేస్తాయి. అందుకే వైసీపీ అధినేత జగన్ కూడా తాను మళ్లీ పాదయాత్ర చేస్తే అధికారంలోకి వస్తామని అనుకోవడం ఒక రకంగా పార్టీకి తన బొమ్మే ఫైనల్ అని తేల్చి చెప్పడమేనంటున్నారు. పాదయాత్ర వల్లనే గతంలో కొందరు అధికారంలోకి ఉండివచ్చు. కానీ కేవలం పాదయాత్ర వల్లనే అధికారంలోకి రారన్నది కూడా అనేక రాష్ట్రాల్లో స్పష్టమయింది. బీహార్ లో ప్రశాంత్ కిషోర్, మధ్యప్రదేశ్ లో నాడు దిగ్విజయ్ సింగ్ పాదయాత్రలు చేసినా అధికారంలోకి రాలేకపోయిన విషయాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా నియోజకవర్గ స్థాయిలో మంచి నాయకత్వాన్ని ఎంపిక చేయడమే విజయానికి అసలు మార్గమని పలువురు సూచిస్తున్నారు.

# అడగడుగునా అడ్డంకులు...

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయంగా అనుభవం ఉన్న నాయకుడు. అందులో ఏమాత్రం సందేహం లేదు. విజన్ ఉన్న లీడర్ కూడా. అయితే విడిపోయిన ఆంధ్రప్రదేశ్ ను ఆయన ఎంతవరకూ గట్టున పడేయగలరన్నదే ఇప్పుడు ఆ పార్టీ నేతల్లో కలుగుతున్న అనుమానం. హైదరాబాద్ వేరు. ఒక నిర్ణయం తీసుకున్నా.. అప్పటికే హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందడంతో పాటు అన్ని ప్రాంతాల ప్రజలకు అది అనుకూలమైన నివాసయోగ్య ప్రాంతంగా ఉండటం, వాతావరణం అనుకూలత ఇన్ని ప్లస్ పాయింట్ల మధ్య చంద్రబాబు సక్సెస్ సాధించి ఉండవచ్చు. కానీ అమరావతి విషయంలో సక్సెస్ సాధించడం అంత సులువు కాదన్నది వాస్తవం పొలాల్లో రాజధాని నిర్మాణాలను చేపట్టడమే ఒక సాహసోపేతమైన నిర్ణయం. రాజధాని నిర్మాణానికే ఏళ్లు పడుతుంది. భవన నిర్మాణాలకు తరచూ వచ్చే వానలు, సంభవించే పనులు వంటివి సహకరించకపోవచ్చు. ప్రకృతి కూడా రాజధాని నిర్మాణానికి అంత అనుకూలంగా ఉండదు. అదే సమయంలో ఎ నుంచి మొదలుపెట్టి ఎక్కడ వరకూ వెళ్లాలన్నదిఎవరికీ తెలియని పరిస్థితి. రాజధాని నిర్మాణం పూర్తి అంటే కేవలం నాలుగు భవనాలు నిర్మించితే సరిపోదు. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కూడా కావాలి. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం సహకరిస్తుంది కాబట్టి గుడ్డిలో మెల్ల. కానీ ఎన్ని కోట్లని అప్పులు తెచ్చి అక్కడ అభివృద్ధి చేస్తారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నఅందకుంటే ఇలా చేయండి మరో మూడేళ్లలో ఎన్నికలు... ఎందుకంటే మరో మూడేళ్లలో మళ్లీ ఎన్నికలు వస్తాయి. అప్పుడు కూటమిలో ఉన్నప్పటికీ ఈసారి రాజకీయ అవసరం బీజేపీకి వచ్చే ఎన్నికల్లో ఉండొచ్చు. ఉండకపోవచ్చు. రాజకీయ అవసరం, టీడీపీ మద్దతు అవసరమైతేనే రాజధాని నిర్మాణానికి కేంద్రం సహకరిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అదీ నిధులు ఇచ్చి కాదు.. రుణాలు తీసుకోవడంలో వెసులుబాటు మాత్రమే. కానీ వచ్చే ఎన్నికల్లో మోదీ పార్టీకి బంపర్ మెజారిటీ వచ్చి ఏపీ పార్టీల రాజకీయ అవసరం లేకపోతే మాత్రం రాజధాని కాదు కదా.. ఏపీ వైపు కూడా కేంద్ర ప్రభుత్వం చూసే అవకాశముండదు.అందుకే రాజధాని నిర్మాణం మాత్రం చంద్రబాబుకు ఒక సవాల్ అని చెప్పాలి. చెప్పినంత సులువు కాదు. ఆదేశాలు ఇచ్చినంత ఈజీ కాదు.అన్నీ సహకరించాలంటే అందుకు చాలా సమయం కావాలి. కావాల్సిన నిధులు కావాలి. మరి ఇవన్నీ దక్కాలంటే ఎన్నేళ్లన్నది మాత్రం ఎవరికీ తెలియదు.

# కమలానికి తెలుగు రాష్ట్రాల్లో.. పట్టని చిక్కు

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666




ఊరంతా ఆనందం.. కానీ మన ఇంట్లో లేదు అన్నట్టు ఉంది తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ వ్యవహారం. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఆ పార్టీ హవా చాటుతోంది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంతో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో సైతం అధికారంలోకి రాగలుగుతోంది. కానీ దక్షిణ భారతదేశంలో.. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఆ పార్టీ పరిస్థితి ఎంత మాత్రం మెరుగుపడడం లేదు. మిత్రుల సాయంతో పర్వాలేదనిపిస్తోంది. కానీ సొంతంగా ఎదగాలన్న క్రమంలో చతికల పడుతోంది. బిజెపికి మాత్రమే ఎందుకు ఈ పరిస్థితి అనేది ఒక వాదన. నాయకుల మధ్య సమన్వయ లోపమే ఈ పరిస్థితికి కారణమన్నట్టు విశ్లేషణలు ఉన్నాయి. బీహార్లో బిజెపి అతిపెద్ద పార్టీగా అవతరించడంతోపాటు ఎన్డీఏ తిరుగులేని విజయం సాధించడంతో.. తెలుగు రాష్ట్రాల్లో సరికొత్త చర్చ ప్రారంభం అయింది. తెలుగు రాష్ట్రాల్లో ఇంకెప్పుడూ సంబరాలు అని ఎక్కువమంది పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు.ఏపీలో బిజెపి అభివృద్ధి అనేది ఇప్పట్లో జరిగే పనిలా కనిపించడం లేదు. ఎందుకంటే క్షేత్రస్థాయిలో ఆ పార్టీ బలం పెరగడం లేదు. దీనికి అనేక రకాల కారణాలు ఉన్నాయి. ఇక్కడ బలమైన రెండు ప్రాంతీయ పార్టీలు హవా చూపిస్తున్నాయి. వాస్తవానికి టిడిపి ఆవిర్భావ సమయానికి ఏపీలో బిజెపి ఎంట్రీ ఇచ్చింది. విశాఖలో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 1982లోనే బిజెపి విజయం సాధించింది. కానీ తరువాత సొంతంగా ఎదిగే ప్రయత్నం చేయలేదు. బిజెపి విధానాలు ఏపీ ప్రజల్లోకి బలంగా వెళ్లలేదు. జాతీయస్థాయిలో బిజెపి అవసరార్థం ఏపీలో ఉన్న రాజకీయ పొత్తులతో బిజెపిని గెలిపించాయే తప్పించి.. బిజెపి సొంతంగా ఎదిగిన దాఖలాలు మాత్రం ఏపీలో లేవు. 2019 ఎన్నికల్లో కనీసం ఆ పార్టీకి డిపాజిట్లు కూడా రాలేదు. 2024లో తెలుగుదేశం, జనసేనతో జతకట్టడంతో 8 ఎమ్మెల్యే సీట్లు, మూడు ఎంపీ సీట్లను గెలుచుకున్న బీజేపీ ప్రాతినిధ్యం పెంచుకుంది. 2029 ఎన్నికల్లో ఇదే పొత్తు కొనసాగితే పరవాలేదు కానీ.. పొత్తు లేకుంటే మాత్రం ఒక్క సీటు కూడా బిజెపి గెలిచే అవకాశం లేదు.ఏపీతో పోల్చుకుంటే తెలంగాణలో బిజెపి అభివృద్ధికి చాలా రకాల అవకాశాలు వచ్చాయి. అక్కడి ప్రజలు బిజెపిని ఆదరించారు కూడా. 2014లో రాష్ట్ర విభజన జరిగింది. అప్పటినుంచి తెలంగాణలో బిజెపి అభివృద్ధి కావడం ప్రారంభం అయింది. క్రమేపీ తన ప్రాతినిధ్యాన్ని పెంచుకుంటూ వచ్చింది. అయితే 2023లో కెసిఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ పార్టీ ఓడిపోయిన నాటి నుంచి బిజెపి ఎదగడం ప్రారంభించింది. కాంగ్రెస్ అధికారంలో ఉండగా ప్రధాన ప్రతిపక్ష పాత్రను బిజెపి పోషించింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీతో సమానంగా ఎనిమిది పార్లమెంట్ సీట్లను కైవసం చేసుకుంది. బిఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెలవలేదు. చాలా చోట్ల డిపాజిట్లు కూడా దక్కలేదు. ఇటువంటి పరిస్థితుల్లో బిఆర్ఎస్ స్థానంలో బిజెపి వచ్చి చేరిందని విశ్లేషణలు మొదలయ్యాయి. కానీ తెలంగాణ బిజెపిలో నేతల మధ్య సమన్వయ లోపంతో పార్టీ బలహీన పడింది. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కనీసం డిపాజిట్లు కూడా బిజెపికి రాలేదు. అదే సమయంలో కెసిఆర్ పార్టీ తన బలాన్ని పెంచుకుంది. రెండో స్థానంలో నిలిచింది. అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో తెలంగాణ బిజెపి విఫలం అయింది.ఏపీలో ఎదిగే ప్రయత్నం జరగడం లేదు.

తెలంగాణలో ఎదిగిన తరువాత పార్టీ బలహీనం అవుతోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏపీలో పార్టీ అభివృద్ధి అనేది కూడా జరగదు. ఎందుకంటే కేంద్రంలో ఎన్డీఏ లో టిడిపి కీలక భాగస్వామిగా ఉంది. ఆ కారణం చేత ఏపీలో టిడిపిని కాదని బిజెపిని మరింత బలపరిచే పరిస్థితి కనిపించడం లేదు. తెలంగాణలో కెసిఆర్ పార్టీని కాపాడేందుకు బిజెపి తనను తాను తగ్గించుకుంది అన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనేందుకు బిఆర్ఎస్ తో బిజెపి చేతులు కలిపిందన్న మాటలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయి. బిజెపికి ఓటు వేస్తే బీఆర్ఎస్ కు వేసినట్టేనని ప్రజలు ఒక నిర్ణయానికి వచ్చారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి జై కొట్టారు. మొత్తానికి అయితే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ ఎదగడం అన్నది ఇప్పట్లో జరిగే పని మాత్రం కాదు.

# ఏపీలోభారీగా ఉద్యోగాలు.. జాబ్ క్యాలెండర్ రెడీ

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయనుంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలను గుర్తించి, %ఎ=మీ% పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. దాదాపు 99 వేల వరకు నేరుగా నియామకాలకు ఖాళీలున్నాయని అంచనా. రెవెన్యూ, ఉన్నత విద్య, పురపాలక, పంచాయతీరాజ్ వంటి శాఖల్లో వేలాది ఉద్యోగాలు భర్తీ కానున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలను గుర్తించి, వాటి వివరాలను సేకరిస్తోంది. ఈ ప్రక్రియలో భాగంగా, మంజూరైన పోస్టులు, ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థానాలు, కాంట్రాక్టు ఉద్యోగుల వివరాలను సేకరించి, ఆర్థిక శాఖ ఆధ్వర్యంలోని నిధి హెచ్‌ఆర్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. కొన్ని ప్రభుత్వ విభాగాలు తమ వివరాలను ఇప్పటికే ఈ పోర్టల్‌లో నమోదు చేశాయి. మరికొన్ని విభాగాలు ఇంకా ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. మంజూరైన పోస్టులు, ఖాళీల వివరాలను పోర్టల్‌లో పొందుపరిచారు. ఈ వివరాలను ఆయా శాఖల అధిపతులు ధృవీకరించాల్సి ఉంటుంది.ఏపీ ప్రభుత్వ శాఖల్లో ప్రాథమికంగా దాదాపు 30 శాతం వరకు ఉద్యోగ ఖాళీలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఖాళీలలో కొన్నింటిలో ప్రస్తుతం కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇప్పటివరకు, 157 ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన మంజూరైన పోస్టులు, ఖాళీల వివరాలను నిర్ధారించారు. ఈ సమాచారం ఆధారంగానే ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను రూపొందించనుంది. దాదాపు 99వేల వరకు ఖాళీలు నేరుగా నియామకాల (డీఆర్)కు వచ్చేవి ఉన్నాయి. 24 విభాగాల్లో ఖాళీలకు సంబంధించిన వివరాలపై క్లారిటీ రావాల్సి ఉంది. మరో 21 శాఖల వివరాలు నమోదు చేయడం ప్రాసెస్‌లో ఉంది. ఈ ప్రక్రియ పూర్తయితేనే ఖాళీల లెక్క తేలుతుందంటున్నారు. నిరుద్యోగ యువతతో నేరుగా నియామకాలకు వచ్చే వాటిని చేస్తారు.. కొన్ని పోస్టులను నిబంధనల ప్రకారం ఇన్ సర్వీసు పదోన్నతులతో నింపుతారు.రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో వేలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. రెవెన్యూ శాఖలో మొత్తం 13 వేల ఖాళీలుంటే, ఏడు హెచ్‌ఓడీలు 4,787 ఖాళీలను గుర్తించారు. వీటిలో 2,552 నేరుగా నియామకాలకు కేటాయించారు. ఉన్నత విద్యా శాఖలో 7 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విశ్వవిద్యాలయాల్లో 3 వేలకు పైగా ఉన్న ఖాళీలను కోర్టు కేసుల సమస్యలు తొలగించి భర్తీ చేయడానికి చర్యలు మొదలుపెట్టారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో ఉన్న 27 వేల ఖాళీల్లో దాదాపు 23ఖు వేల ఉద్యోగాలను నేరుగా నియామకాల ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగంలో 4 వేలకు పైగా ఖాళీలు గుర్తించగా, వాటిలో 2,600 నేరుగా నియామకాలకు వస్తాయి. వ్యవసాయ శాఖలో 3 వేలకు పైగా ఖాళీలుంటే, వాటిలో 2,400 డీఆర్ పోస్టులు. పంచాయతీరాజ్ శాఖలో నేరుగా నియామకాలకు 26 వేల వరకు పోస్టులు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. మరో మూడు వేల పోస్టులను ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్నవారికి పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తారు. మహిళ, శిశు, విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్ విభాగంలో 2,400 ఖాళీలున్నాయి. వీటిలో 1,820 నేరుగా నియామకాలకు కేటాయించారు.24 ప్రభుత్వ విభాగాలు, ముఖ్యంగా పాఠశాల విద్యా శాఖ, తమ వద్ద ఉన్న మంజూరు పోస్టులు, ఖాళీల వివరాలను ఇంకా ఖరారు చేయలేదు. దీనివల్ల దాదాపు 30 వేల వరకు పాఠశాల విద్యలో బోధన, బోధనేతర ఖాళీలు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ విభాగంలో నేరుగా నియామకాలకు 10 వేల పోస్టులు సిద్ధంగా ఉన్నాయి. ఏపీఎస్పీ, ఇంటర్మీడియట్ విద్య, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్, కర్నూలు జలవనరుల ప్రాజెక్టులు, దేవాదాయ, కడప జలవనరుల శాఖ ప్రాజెక్టులు, ప్రజా గ్రంథాలయాలు, ఏపీ భవన్, ఎన్‌సీసీ, ప్రింటింగ్ స్టేషనరీ, స్టోర్స్ పర్చేజ్ వంటి అనేక విభాగాలు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు.

# వంగవీటి ఫ్యామిలీకి కాపు కాస్తారా...

బి. ఎన్. రావు ( నగేష్ బూర్తి )సీనియర్ జర్నలిస్ట్ , విజయవాడ,7702262666

ఏపీ రాజకీయాల్లో కాపులు ఎప్పుడు ప్రత్యేక స్థానమే. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి వారి ప్రస్తావన ప్రత్యేకంగా ఉంటుంది. వారి ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ ప్రకటనలు కూడా వస్తాయి. ఎందుకంటే ఏపీలో సంఖ్యా బలంగా కాపులు అధికం కాబట్టి. అందుకే వారిపై ప్రభావం చూపే ఏ అవకాశాన్ని రాజకీయ పార్టీలు విడుచుకోవు. కాపులు ఏ పార్టీకి వెన్నుదన్నుగా ఉంటే ఆ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం. చాలా సందర్భాల్లో కూడా ఇది చూసాం. మిగతా సామాజిక వర్గాలకు భిన్నంగా ఉంటుంది కాపుల వైఖరి. సీఎం వంటి పోస్టులు దక్కలేదన్న ఆందోళన, ఆవేదన ఆ సామాజిక వర్గంలో ఉంది. అయితే దానిని కొంతవరకు నెరవేర్చారు పవన్ కళ్యాణ్. ఏపీ రాజకీయాల్లో తనకంటూ ఒక ముద్ర చాటుకొని డిప్యూటీ సీఎం హోదా వరకు వెళ్లారు. ఈ రాష్ట్రానికి ఏకైక డిప్యూటీ సీఎం గా ఉంటూ చంద్రబాబుతో సమానంగా తన పవర్ను వాడుతున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ టిడిపి తో కలిసి వెళ్తారు. బిజెపిని కలుపుకొని పోటీ చేస్తారు. దీంతో కాపు సామాజిక వర్గం కూటమి వైపు తప్పకుండా ఉంటుంది. అయితే దానికి విరుగుడు చర్యలుగా జగన్మోహన్ రెడ్డి దిగ్గజ కాపు నేతల కుటుంబాలను తన వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా వంగవీటి మోహన్ రంగ కుమార్తె ఆశా కిరణ్ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఆమె వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతారని ప్రచారం ప్రారంభం అయింది.కాపులు అంటే ముందుగా గుర్తొచ్చే పేరు ముద్రగడ పద్మనాభం. ఎందుకంటే ఆయన రాజకీయ నాయకుడిగానే కాకుండా కాపు రిజర్వేషన్ ఉద్యమ నేతగా గుర్తింపు పొందారు. కాపులకు రాజకీయంగా ప్రాతినిధ్యం దక్కడంతో పాటు రిజర్వేషన్లు సైతం కల్పించాలని పోరాడారు. ఈ క్రమంలో ఆయన పోరాటం పక్కకు వెళ్ళింది. ఇప్పుడు ప్రత్యేక పరిస్థితుల్లో ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి గా చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని ప్రకటించారు. అయితే కాపుల్లో ముద్రగడ పద్మనాభం ప్రభావం క్రమేపి తగ్గింది అన్నది వాస్తవం. ఎందుకంటే 2024 ఎన్నికల్లో ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపడమే కాదు.. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని శపథం చేశారు. పవన్ ఓడిపోకుంటే తాను పేరు మార్చుకుంటానని కూడా ప్రకటించారు. వైసీపీ దారుణంగా ఓడిపోవడంతో తన పేరు మార్చుకున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో రాజకీయాల్లో యాక్టివ్ తగ్గించారు.అయితే ముద్రగడ ప్రయోగం విఫలం కావడంతో జగన్మోహన్ రెడ్డిపునరాలోచనలో పడ్డారు. టిడిపిలో ఉన్న వంగవీటి మోహన్ రంగా కుమారుడు రాధాకృష్ణను వైసీపీలోకి రప్పించేందుకు ప్రయత్నించాడు. అవి వర్క్ అవుట్ కాకపోయేసరికి మోహన్ రంగ కుమార్తె ఆశాకిరణ్ వైపు చూసినట్లు తెలుస్తోంది. రాజకీయంగా సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ సీటును కానీ.. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో వంగవీటి కుటుంబ అవసరం జగన్మోహన్ రెడ్డికి ఉంది. అందుకే ఈ ఓపెన్ ఆఫర్ చేసినట్లు సమాచారం. అయితే ప్రస్తుతానికి రంగా రాధా మిత్రమండలి ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టి.. 2029 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరాలని అంగీకారం కుదిరినట్లు సమాచారం.ఇప్పుడున్న పరిస్థితుల్లో కాపు సామాజిక వర్గం మద్దతు జగన్మోహన్ రెడ్డికి చాలా అవసరం. ఎందుకంటే కాపులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ను తమ ఐకానిక్ లీడర్ గా భావిస్తున్నారు. పవన్ కళ్యాణ్ లో తమ సామాజిక వర్గ విజయాన్ని చూసుకుంటున్నారు. 2019 నుంచి 2024 మధ్య వైసీపీ పాలనలో తమకు ఎదురైన పరిణామాలు కాపు సామాజిక వర్గానికి తెలుసు. అందుకే జగన్ ప్రయత్నాలు వర్క్ అవుట్ అయ్యే అవకాశం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు కానీ వంగవీటి మోహన్ రంగ కుమార్తె ఆశాకిరణ్ వైసీపీలో చేరితే మాత్రం అది కుటుంబాన్ని చీల్చినట్టే. వంగవీటి కుటుంబాన్ని చీల్చడం ద్వారా కొత్త విమర్శను ఆయన ఎదుర్కోవడం ఖాయం. చూడాలి మరి ఏం జరుగుతుందో..?

# పాకిస్థాన్, శ్రీలంక, జింబాబ్వే జట్ల మధ్య ట్రై సిరీస్..

# స్క్వాడ్, టైమింగ్, షెడ్యూల్ వివరాలు!




**హైదరాబాద్ పెన్ పవర్:** ముక్కోణపు సిరీస్ క్రికెట్ ఫ్యాన్స్ ను అలరించడానికి సిద్ధంగా ఉంది. టీ20 ఫార్మాట్ లో పాకిస్థాన్, శ్రీలంక, జింబాబ్వే ట్రై సిరీస్ ఆడనున్నాయి. మంగళవారం (నవంబర్ 18) నుండి ప్రారంభం కానున్న ఈ టోర్నీ నవంబర్ 29 వరకు జరుగుతోంది. సొంతగడ్డపై జరగనుండడంతో పాకిస్థాన్ ఈ ట్రై సిరీస్ లో ఫేవరేట్ గా బరిలోకి దిగనుంది. శ్రీలంక జట్టు పోటీ ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. మరోవైపు జింబాబ్వే సంచలన ఫలితం కోసం ఎదురు చూస్తుంది. మ్యాచ్ లన్నీ రావల్పిండి స్టేడియంలో జరుగుతాయి. భారత కాలమాన ప్రకారం సాయంత్రం 6:30 గంటలకు మ్యాచ్ లు ప్రారంభమవుతాయి. టాస్ 6 గంటలకు వేస్తారు. కాసేపట్లో ప్రారంభం కానున్న ఈ టోర్నీ తొలి మ్యాచ్ లో ఆతిథ్య పాకిస్థాన్ తో జింబాబ్వే తలపడుతోంది. మిగిలిన మ్యాచ్‌లు నవంబర్ 20, 22, 23, 25, 27 తేదీల్లో జరగనున్నాయి. టాప్-2లో నిలిచిన జట్లు నవంబర్ 29న ఫైనల్ ఆడతాయి. దురదృష్టవశాత్తు.. ఇండియాలో ఈ ట్రై సిరీస్ లైవ్ స్ట్రీమింగ్. లైవ్ టెలికాస్టింగ్ లేదు. స్పోర్ట్స్ టీవీ యూట్యూబ్ ఛానెల్‌లో మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారమవుతాయి. 2026 టీ20 వరల్డ్ కప్ కు ముందు మూడు జట్లకు ఈ సిరీస్ మంచి ప్రాక్టీస్ లా ఉంటుంది. పాకిస్తాన్ వైమానిక దాడి కారణంగా ఆఫ్ఘనిస్తాన్ ట్రై-సిరీస్ నుండి వైదొలిగిన సంగతి తెలిసిందే. ఆఫ్ఘనిస్తాన్ తప్పుకున్న ఈ సిరీస్ యధావిధిగా జరగనుంది. ఆఫ్ఘనిస్తాన్ స్థానంలో జింబాబ్వే ఈ ట్రై సిరీస్ ఆడనుంది.

**ట్రై-సిరీస్ షెడ్యూల్:**

నవంబర్ 18 - పాకిస్తాన్ VS జింబాబ్వే, 6:30 గంటలకు
నవంబర్ 20 - శ్రీలంక VSజింబాబ్వే, 6:30 గంటలకు
నవంబర్ 22 - పాకిస్తాన్ VS శ్రీలంక, 6:30 గంటలకు
నవంబర్ 23 - పాకిస్తాన్ VS జింబాబ్వే, 6:30 గంటలకు
నవంబర్ 25 - శ్రీలంక VS జింబాబ్వే, 6:30 గంటలకు
నవంబర్ 27 - పాకిస్తాన్ VS శ్రీలంక, 6:30 గంటలకు
నవంబర్ 29 - ఫైనల్, 6:30 గంటలకు

పాకిస్థాన్, శ్రీలంక, జింబాబ్వే స్క్వాడ్స్:


**పాకిస్థాన్:**
సల్మాన్ అఘా (కెప్టెన్), అబ్దుల్ సమద్, అబ్రార్ అహ్మద్, బాబర్ ఆజం, ఫహీమ్ అష్రఫ్, ఫఖర్ జమాన్, మహ్మద్ నవాజ్, మహ్మద్ వసీం, నసీమ్ షా, సాహిబ్జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్, సల్మాన్ మీర్జా, షాహీన్ అఫ్రిది, ఉస్మాన్ ఖాన్ మరియు ఉస్మాన్ తారిఖ్

**శ్రీలంక:**
పాతుమ్ నిస్సాంక, కుసల్ మెండిస్, కుసల్ పెరీరా, కమిల్ మిషార, దసున్ షనక (కెప్టెన్), కమిందు మెండిస్, భానుక రాజపక్స, జనిత్ లియానాగే, వనిందు హసరనాగ, మహేశ్ తీక్షణ, దుషన్ హేమంత, దుష్మంత చమీర, నువాన్ తుషార, మరియు ఎషాన్ మలింగ

**జింబాబ్వే:**
సికందర్ రజా (కెప్టెన్), బ్రియాన్ బెన్నెట్, ర్యాన్ బర్ల్, గ్రేమ్ క్రీమర్, బ్రాడ్లీ ఎవాన్స్, క్లైవ్ మదాండే, టినోటెండా మపోసా, వెల్లింగ్టన్ మసకద్జా, తాడివానాషే మారుమణి, టోనీ మున్యోంగా, తషింగా ముసెకివా, డియోన్ స్మవారి, రిచర్డ్‌డాన్‌గార్ టాయ్‌లోర్ మరియు

# కెప్టెన్‌ను ప్రకటించిన ఢిల్లీ క్యాపిటల్స్..

# మరోసారి ఆల్ రౌండర్‌పై నమ్మకం




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ తమ కెప్టెన్ ను ప్రకటించింది. ఐపీఎల్ 2025 సీజన్ లో ఢిల్లీ జట్టును నడిపించిన అక్షర్ పటేల్ కే ఢిల్లీ క్యాపిటల్స్ పగ్గాలు అప్పగించారు. ఈ విషయాన్ని మంగళవారం (నవంబర్ 18) అధికారికంగా ప్రకటించింది. గత సీజన్ మెగా ఆక్షన్ కు ముందు ఢిల్లీ రూ. 16.50 కోట్లతో ఈ టీమిండియా ఆల్ రౌండర్ ను రిటైన్ చేసుకుంది. దీంతో ఐపీఎల్‌లో అక్షర్ కు తొలిసారి కెప్టెన్సీ దక్కింది. గత సీజన్ లో ప్లే ఆఫ్స్ కు తీసుకెళ్లడంలో అక్షర్ విఫలమైనప్పటికీ మరోసారి ఈ టీమిండియా ఆల్ రౌండర్ ను నమ్మి కెప్టెన్సీని కొనసాగించింది. ఇటీవలే ఆసియా కప్ కు అక్షర్ పటేల్ ను టీ20 వైస్ కెప్టెన్ గా తొలగించి అతని స్థానంలో యువ బ్యాటర్ శుభమాన్ గిల్ కు ఆ బాధ్యతలు అప్పగించారు. ఈ ఏడాది జనవరిలో ఇంగ్లాండ్ తో జరిగిన టీ20 సిరీస్ లో అక్షర్ పటేల్ కు భారత వైస్ కెప్టెన్సీ బాధ్యతలు ఇచ్చినా ఒక్క సిరీస్ కే పరిమితమయ్యాడు. దేశవాళీ క్రికెట్‌లో గుజరాత్ జట్టును సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీ వంటి టోర్నీల్లో నడిపించాడు. 2025 ఐపీఎల్ సీజన్ లో అక్షర్ పటేల్ కెప్టెన్సీలో ఢిల్లీ క్యాపిటల్స్ 7 మ్యాచ్ ల్లో విజయం సాధించి పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో నిలిచింది. కెప్టెన్ గా పర్వాలేదనిపించిన అక్షర్ 2026 ఐపీఎల్ లో ఢిల్లీ జట్టును ఎలా నడిపిస్తాడో ఆసక్తికరంగా మారింది.

కొన్ని నెలల క్రితం అక్షర్ ను ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ గా తొలగిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. మరోవైపు జట్టులో కేఎల్ రాహుల్ లాంటి అనుభవమున్న ప్లేయర్ ఉన్నప్పటికీ ఈ సీనియర్ ప్లేయర్ తాను కెప్టెన్ పదవి వద్దని చెప్పాడు. దీంతో సౌతాఫ్రికా యంగ్ ప్లేయర్ ట్రిస్టన్ స్టబ్స్ కు కెప్టెన్సీ బాధ్యతలు ఇస్తారనే వార్తలు వినిపించాయి. స్టబ్స్ కు అనుభవం లేకపోవడంతో అక్షర్ వైపే ఢిల్లీ మొగ్గు చూపింది. ఐపీఎల్ 2026 మినీ-వేలంలో ఢిల్లీ 21.8 కోట్లతో బరిలోకి దిగుతుంది. డిసెంబర్ 16 న ఐపీఎల్ మినీ వేలం అబుదాబిలో జరగనుంది.

**ఢిల్లీ క్యాపిటల్స్**
అక్సర్ పటేల్, కేఎల్ రాహుల్, కరుణ్ నాయర్, అభిషేక్ పోరెల్, ట్రిస్టన్ స్టబ్స్, సమీర్ రిజ్వీ, అశుతోష్ శర్మ, విప్రజ్ నిగమ్, అజయ్ మండల్, త్రిపురాన విజయ్, మాధవ్ తివారీ, మిచెల్ స్టార్క్, టి.నటరాజన్, ముఖేష్ కుమార్, దుష్మంత చమీర, కుల్దీప్ యాదవ్, నితీశ్ రానా.

రిలీజ్ ప్లేయర్స్: మోహిత్ శర్మ, ఫాఫ్ డు ప్లెసిస్, సెడికుల్లా అటల్, జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్, మన్వంత్ కుమార్, దర్శన్ నల్కండే, డోనోవన్ ఫెరీరా


# 'ఐటమ్ భామ' అంటూ తక్కువగా చూసారు!- మలైకా

బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ మలైకా అరోరా వ్యక్తిగత, వృత్తిగత జీవితం ఎప్పుడూ హెడ్ లైన్స్ లో నిలుస్తుంది. యువహీరో అర్జున్ కపూర్ తో ఎఫైర్ కారణంగా నిరంతరం మీడియా హెడ్ లైన్స్ లోకి వచ్చిన మలైకా అతడితో బ్రేకప్ అయ్యాక, ఇటీవల స్థబ్ధుగా ఉంది. కొంతకాలంగా తన కెరీర్ పైనే ఫోకస్ చేస్తోంది.అయితే మలైకా అరోరా భవిష్యత్ లో సినిమాల నిర్మాణం, దర్శకత్వం వైపు అడుగులు వేసే ఆలోచనలో ఉందా? అంటే దానికి అవకాశం లేకపోలేదని సమాధానం ఇచ్చింది. తనకు కెమెరా వెనక సాంకేతిక అంశాలపైనా ఆసక్తి ఉందని మలైకా తాజా ఇంటర్వ్యూలో వెల్లడించింది. తెరవెనక చాలా అంశాలు ఆసక్తిని కలిగిస్తాయని, ఏదో ఒకరోజు ఆ పని చేస్తానని పేర్కొంది.



ప్రిషా రాజేష్ సింగ్ మోడ్రన్ డ్రెస్‌లో స్టన్స్, ఫ్యాషన్ ఫేవరెట్‌గా హృదయాలను గెలుచుకోవడం కొనసాగించింది

నటిగా పెద్ద స్థాయిని ఎందుకు కోరుకోరు? అని ప్రశ్నిస్తే... మొదటి నుంచి తాను నర్తకిగా కొనసాగానని, స్పెషల్ నంబర్లు చేయడం తన ప్రధాన బలం, ఆసక్తి అని చెప్పింది. నాకు ఎందులో బలం ఉందో అదే దారిలో వెళ్లానని చెప్పారు. ఒకానొక దశలో ఐటమ్ పాటను తక్కువగా చూసారు. ఐటమ్ నర్తకిని చిన్నగా చూసారు. కానీ కాలక్రమంలో అది మారింది. ఐటమ్ పాటలో నర్తించడం అంటే అందాలు ఆరబోయడం ఒక్కటే కాదు.. హావభావాల వ్యక్తీకరణ, క్రియేటివిటీ పరంగా సవాల్‌ని ఎదుర్కోవడం అని నెమ్మదిగా గ్రహించారని కూడా మలైకా అన్నారు. కథనాన్ని నడిపించే దమ్ము ఐటమ్ పాటలోను ఉంటుందని మలైకా అన్నారు. ఐటమ్ నంబర్ల మేకింగ్ పై ఇప్పుడు మంచి గౌరవం ఉందని అన్నారు. ఈమధ్యనే 50కి ఒక సంవత్సరం అదనంగా పెరిగింది. ఎప్పటికీ ఇదే ఉత్సాహం ఉంది నాలో. నాపై అభిమానం, ప్రేమ చూపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఇన్నేళ్లుగా నన్ను ఆదరించిన వారందరికీ ప్రత్యేకించి కృతజ్ఞతలు అని అన్నారు. తన వ్యక్తిగత జీవితం గురించి ఎదురయ్యే ట్రోలింగ్ పైనా మలైకా మనసు విప్పి మాట్లాడారు. నిజానికి మనల్ని అనేవాళ్లు ఎప్పుడూ ఉంటారు. కానీ నేను నాపై దృష్టి పెట్టడం నేర్చుకున్నాను. ప్రతికూలత నన్ను డిసైడ్ చేయనివ్వను. ట్రోల్స్ ఉంటాయి. కానీ నేను ఆ విషాన్ని స్వీకరించను. నా కుటుంబం, స్నేహితులు నాకు చాలా ముఖ్యం.. మనశ్శాంతి ఇంకా ఎక్కువ ముఖ్యం! అని అన్నారు. మలైకా ప్రస్తుతం డ్యాన్స్ రియాలిటీ షోల జడ్జిగా ఆర్జిస్తున్నారు. ఇండస్ట్రీలో టాప్ మోడల్ గా కొన్ని బ్రాండ్లతో కాంట్రాక్టుల ద్వారా కూడా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.





చీరలో మాళ్వీ మల్హోత్రా స్టన్స్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com